తెలంగాణ-ఆంధ్రా సరిహద్దుల్లోని అశ్వారావుపేట మండలంలో ఇటీవల భారీ వర్షాలకు గండిపడిన పెదవాగు ప్రాజెక్టుకు అత్యవసర మరమ్మతులు చేపట్టారు. దీని ద్వారా అశ్వారావుపేట మండలంలోని సుమారు 2,300 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందించేందుకు నీటి పారుదల శాఖ సన్నాహాలు చేస్తోంది. పెదవాగు ప్రాజెక్టు నీటి నిల్వ ప్రాంతంలో రింగ్‌బండ్ ఏర్పాటు చేయబోతున్నారు. 15 రోజుల్లోగా ఈ రింగ్‌బండ్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సుమారు రూ.3.50 కోట్లతో 350 మీటర్ల పొడవున 6 మీటర్ల ఎత్తున నిర్మించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు రంగం సిద్ధం చేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. తాత్కాలిక మరమ్మతులకు నిధులు విడుదల చేయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు వారు సుముఖత వ్యక్తం చేయడంతో వెంటనే పెదవాగు ప్రాజెక్టు రింగ్‌బండ్ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



పెదవాగుకు గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల (ఫైల్)

పెదవాగుకు రింగ్‌బండ్



- తాత్కాలిక మరమ్మతులకు రూ.3.50 కోట్లు
- 350 మీటర్ల పొడవు, ఆరు మీటర్ల ఎత్తున నిర్మాణం
- ఈ ఏడాదే సాగునీరు ఇచ్చేందుకు సన్నాహాలు
- అశ్వారావుపేట మండలంలోని 2,300 ఎకరాలకు లబ్ధి
- మరమ్మతు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదినారాయణ
- ఫలించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చొరవ

ఖమ్మం జూలై 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పెదవాగు ప్రాజెక్టు గండిపడినప్పుడు మంత్రి తుమ్మల రైతులకు భరోసా ఇచ్చారు. సాధ్యమైనంత త్వరలో మరమ్మతులు చేస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా పెదవాగు ప్రాజెక్టును సందర్శించి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలో రెండు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న పెదవాగు ప్రాజెక్టు ప్రస్తుతం ఉమ్మడిగా చేపట్టాలంటే శాశ్వత మరమ్మతు చర్యలు అదనంగా మరో మూడు గేట్లు ఏర్పాటు, సుమారు లక్ష క్యూసెక్కుల నీరు నిల్వ ఉండేలా ప్రాజెక్టు రీడిజైన్ చేయాల్సిన అవసరం ఉంది. 80శాతం నిధులు ఆంధ్రా, 20శాతం నిధులు తెలంగాణ ఖర్చుతో ఉమ్మడిగా ఈ ప్రాజెక్టు చేపట్టాలి. మొత్తం 16,500 ఎకరాల్లో సుమారు 2,500 ఎకరాలు తెలంగాణలో ఉంటే మిగిలిన ఆయకట్టు అంతా ఆంధ్రాలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో ఉంది. గోదావరి బోర్డు పరిధిలో ఈప్రాజెక్టు పర్యవేక్షణ సాగుతోంది. ఉమ్మడిగా ఈ ప్రాజెక్టు చేపట్టాలంటే రెండు రాష్ట్రాల ఉన్నతాధికారుల సంయుక్త సమావేశం నిర్వహించాలి. ఆతర్వాత ఉమ్మడి ప్రతిపాదనలు రెండు రాష్ట్రాల నిధుల కేటాయింపు, గోదావరి బోర్డు పర్యవేక్షణలో పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఈపనులన్నీ జరగాలంటే వచ్చే ఏడాదికూడా నీరు ఇవ్వడం సాధ్యం కాని పరిస్థితి. ఈపరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మంత్రి తుమ్మల ముందుచూపుతో రింగ్‌బండ్ ద్వారా తాత్కాలిక మరమ్మతులపై దృష్టిపెట్టారు. కేవలం తెలంగాణలోని అశ్వారావుపేట మండల రైతులకు మాత్రమే పెదవాగు నీరు సాగునీటికి ఉపయోగపడేలా ప్రతిపాదనలు చేయాలని అధికారులకు సూచించారు. నీటిపారుదల శాఖ అధికారులు ఆరుమీటర్ల ఎత్తులో 350 మీటర్ల పొడవున రింగ్‌బండ్‌తో పాటు రెండు తూములు ఏర్పాటుచేసి కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందించబోతున్నారు.

దీంతో ఈఏడాదే పెదవాగు కింద పంటలు వేసుకున్న వరి, పత్తి, మిర్చి ,పండ్లతోటలు ఆయిల్‌పామ్‌కు సాగునీరు అందించే అవకాశం ఉంది. త్వరలో పనులు చేపట్టేందుకు నీటిపారుదల సీఈ శ్రీనివాసరెడ్డి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పనులు కూడా ప్రారంభించబోతున్నారు. 15రోజుల్లోగా రింగ్‌బండ్ పనులు పూర్తిచేసి వర్షపు నీటిని నిల్వ ఉంచి సాగుకు అందించనున్నారు.

రింగ్‌బండ్ అంటే..

చెరువు నుంచి నీరు పూర్తిగా బయటకు వెళ్లకుండా ప్రస్తుతం గండి పడిన చోట అర్ధచంద్రాకారంలో అడ్డుకట్టను నిర్మిస్తారు. అనంతరం కాలువల ద్వారా ఆయకట్టుకు నీరందిస్తారు. ఇది తాత్కాలిక ఏర్పాటు మాత్రమే. ఇదివరకటిలా ఆయకట్టు అంతటికీ నీరు అందాలంటే గండి పడిన కట్టను పూర్తిగా పునర్నిర్మించాల్సి ఉంటుంది. ప్రస్తుతం నిర్మించే రింగ్‌బండ్ ద్వారా తెలంగాణ పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందుతుంది.

పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, జూలై 26: పెదవాగు ఆయకట్టు రైతులను ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.3.50కోట్లతో ఈ సీజన్‌లో రైతులకు నీరందించేందుకు రింగ్‌బండ్‌ను నిర్మించనున్నట్టు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన రింగ్‌బండ్ పనులను కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన అధికవర్షాల వల్ల పెదవాగు కట్టకు గండి పడిందన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తాను అధికారులతో సమీక్షించామన్నారు. అనంతరం ఈ సీజన్‌లో తెలంగాణా పరిధిలోని 2,375 ఆయకట్టు రైతులకు పంటలు పండించేందుకు రింగ్‌బండ్‌ను నిర్మాణం కోసం నిర్ణయించామన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లటం జరిగిందని, ఆయన ఆదేశాలతో నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తక్షణమే రైతులను ఆదుకునేందుకు రింగ్‌బండను నిర్మించి ఈ సీజన్‌లో పంటలు పండించేందుకుగాను రూ.3.50 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రాజెక్టు గండిపడటం,వాగులు పొంగటం ద్వారా పొలాలకు ఇసుక మేటలు వేసాయని, పంటలు నష్టపోయారని, ఇళ్లు నష్టపోయారని అన్నారు. ఇప్పటికే రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా సర్వే చేయించామని, త్వరలోనే తగిన సహాయం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, డీఈఈ సురేష్, డీఈఈ కృష్ణ, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, కాంగ్రెస్ నాయకుడు జూపల్లి రమేష్, అశ్వారావుపేట సొసైటీ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, బండి చెన్నారెడ్డి పాల్గొన్నారు.



'సైబర్' వలలో యువతి

- లింక్స్ క్లిక్ చేస్తే ఆదాయం వస్తుందని నమ్మించిన కేటుగాళ్లు
- అమాయకత్వంతో రూ.3.43 లక్షలు పెట్టుబడి
- డబ్బులు ముట్టిన తర్వాత కేటుగాళ్ల నుంచి స్పందన కరువు
- ఫిర్యాదు చేయడంతో గంటలో ఫ్రీజ్ చేసిన సైబర్‌సెల్



ఖమ్మం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన ఓ యువతి సైబర్ వలలో చిక్కుకుంది. ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, టెలీగ్రామ్‌లలో వచ్చిన లింకులను క్లిక్ చేయడంద్వారా పెద్ద ఎత్తున ఆదాయం వస్తుందని కేటుగాళ్లు నమ్మించారు. రోజుకు రూ.3వేల నుంచి రూ.4వేలు ఆదాయం వస్తుందని చెప్పారు. యూట్యూబ్ సబ్‌స్క్రిప్షన్, లింకు ఓపెన్ చేయడం ద్వారా కొంత నగదు వేసి నమ్మించారు. ఆ తర్వాత టాస్కులను పూర్తి చేయాలని, వాటిని పూర్తి చేయడం ద్వారా మరింత నగదు సంపాదించొచ్చని చెప్పారు. టాస్కులు పూర్తి చేయాలంటే పెట్టుబడి పెట్టాలని, పెట్టిన పెట్టుబడికి మూడింతలు తిరిగి వస్తాయని చెప్పి అకౌంట్లలోకి నగదు జమ చేయించుకున్నారు. ఇలా పలు దఫాలుగా పెట్టే పెట్టుబడి నగదును పెంచుతూ రూ.3.43 లక్షలను తమ అకౌంట్లలోకి బదిలీ చేయించుకున్నారు. ఆ తర్వాత వారినుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అది సైబర్ నేరగాళ్ల పనిగా గుర్తించిన సదరు యువతి వెంటనే 1930కు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన సైబర్ సెల్ పోలీసులు సంబంధిత నగదును సైబర్ నేరగాళ్ల ఖాతాలకు చేరకుండా గంట వ్యవధిలోనే నగదు మొత్తాన్ని ఫ్రీజ్ చేశారు.

ఈ సందర్భంగా సీపీ సునీల్‌దత్ శుక్రవారం సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తించిన గంటలో ఫిర్యాదు చేయడం వల్ల బాధితులకు మరింత వేగంగా మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



మీడియా సమావేశంలో నిందితుడిని చూపుతున్న పోలీసులు

పాత దొంగ.. కొత్త చోరీలు..

- 30 కేసుల్లో నిందితుడు.. పాండురంగాపురం వాసి
- రూ.21లక్షల సొత్తు రికవరీ.. అరెస్ట్ చేసిన పోలీసులు

ఖమ్మం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో నివాసం ఉంటూ పలు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డాడు.. అరెస్ట్ చేసి రిమాండ్ చేసినా బయటకు వచ్చి మళ్లీ దొంగతనాలు మొదలుపెట్టాడు.. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే 30కి పైగా చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న దొంగను శుక్రవారం ఖమ్మం సీసీఎస్, త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఖమ్మం నగర ఏసీపీ ఎస్‌వీ రమణమూర్తి, సీసీఎస్ ఏసీపీ ఎం.భోజరాజు వెల్లడించారు. ఓ వ్యక్తి గత నెలలో ఇంటికి తాళం వేసి వెళ్లి తిరిగి ఐదు రోజుల తర్వాత రాగా ఇంటి ముందు తలుపు పగలగొట్టి బంగారు ఆభరణాలు దొంగిలించారంటూ ఖమ్మం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి పాత నేరస్థులపై నిఘా ఉంచినట్టు తెలిపారు. శుక్రవారం ఉదయం సీసీఎస్, త్రీటౌన్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టిన క్రమంలో ఖమ్మం పాండురంగాపురానికి చెందిన పాత నేరస్థుడు సంపటి ఉమాప్రసాద్ గాంధీచౌక్‌లో అనుమానాస్పదంగా తిరుగుతండగా పట్టుకుని విచారించినట్టు తెలిపారు. విచారణలో నగరంలోని త్రీటౌన్‌లోని కేసుతోపాటు, ఖమ్మం ఖానాపురం హవేలి స్టేషన్ పరిధిలో రెండు, టూటౌన్‌లో మూడు, వైరా పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కేసుల్లో దొంగతనానికి పాల్పడినట్టు అంగీకరించగా.. అతనివద్ద నుంచి రూ. 21 లక్షల విలువ చేసే 289 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆయా కేసుల్లో దొంగిలించిన నగదుతో హైదరాబాద్‌లో రూ. 1.20 లక్షలు పెట్టి ద్విచక్ర వాహనం కొనుగోలు చేశాడని, దానిని త్వరలో రికవరీ చేస్తామన్నారు. సదరు వ్యక్తి కేరళలో, సూర్యాపేట, హైదరాబాద్, ఖమ్మం ప్రాంతాల్లో సుమారు 30కి పైగా చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్టుగా వారు పేర్కొన్నారు.

పాల్వంచలో ఘరానా దొంగ అరెస్ట్

12 తులాలు బంగారం, 3కేజీల వెండి స్వాధీనం... 7

ఫోన్‌కు చార్జింగ్ పెడుతుండగా..

- విద్యుత్‌షాక్‌తో బాలిక మృతి
- చేతులు తడిగా ఉండటమే కారణం
- చింతకాని మండలం మత్కేపల్లిలో ఘటన..



అంజలి కార్తీక (ఫైల్)

చింతకాని, జూలై 26: విద్యుత్‌షాక్‌తో బాలిక మృతిచెందిన ఘటన ఖమ్మం జిల్లాలోని చింతకాని మండల పరిధిలోని మత్కేపల్లి నామవరం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కటికల అంజలికార్తీక (9) శుక్రవారం ఉదయం సమయంలో సెల్‌ఫోన్‌ను తన తండ్రి వద్ద నుంచి తీసుకుని చార్జింగ్ లేకపోవడంతో తడి చేతులతో చార్జింగ్ పెడుతుండగా పాపకు విద్యుత్ షాక్‌కు గురై ఒక్కసారిగా విలవిలలాడుతూ కుప్పకూలింది. కొద్దిసేపటికి గమనించిన తల్లిదండ్రులు చేతులు కాళ్లు రుద్దగా స్పర్శ లేకపోవడంతో అదే గ్రామంలో ప్రైవేటు వైద్యుని వద్దకు తీసుకెళ్లగా పాప అప్పటికే మృతిచెందిందని నిర్ధారించారు. మృతురాలు అదే గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నది. కటికరాల రామకృష్ణకు భార్య, కూతురు అంజలి కార్తీకతోపాటు కుమారుడు వెంకట గణేష్ ఉన్నారు.

ఐదుగురు తహసీల్దార్ల బదిలీ

ఖమ్మం కలెక్టరేట్, జూలై 26: ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న ఐదుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు తక్షణమే తమకు కేటాయించిన మండలాల్లో చేరాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కొణిజర్ల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆర్.రాంబాబును మధిరకు బదిలీ చేశారు. మధిరలో పనిచేస్తున్న డి.వెంకటేశ్వర్లును కలెక్టరేట్‌కు, చింతకాని తహసీల్దార్ ఎ.రమేష్‌ను ఆర్డీవో కల్లూరుకు, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో పనిచేస్తున్న కె.అనంతరాజును చింతకానికి, కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న తఫ్జల్ హసన్‌ను కొణిజర్ల తహసీల్దార్‌గా బదిలీ చేశారు. వీరంతా తక్షణమే విధుల్లో చేరాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భద్రాద్రి వద్ద ఉధృతంగా గోదావరి



గోదావరి దోబూచులాట

- ఒకసారి తగ్గుతూ.. మరోసారి పెరుగుతూ..
- నాలుగు రోజులుగా మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవాహం
- తాజాగా మళ్లీ రెండో ప్రమాద హెచ్చరిక జారీ

6

ఐటీఐలకు మహర్దశ

కొత్త దారి...



- అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్స్‌గా మార్చిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో నాలుగు ఐటీఐల అప్‌గ్రేడ్
- ఒక్కో ఏటీసీకి రూ.4.77 కోట్లు కేటాయింపు
- ఆరు అధునాతన కోర్సులు అందుబాటులోకి...
- టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో శిక్షణ
- ఏటీసీలకు చేరిన పరికరాలు
- వచ్చే నెలలో అడ్మిషన్ల ప్రక్రియ

ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 26: ప్రభుత్వ ఐటీఐల రూపురేఖలు మారనున్నాయి. కాలంచెల్లిన కోర్సుల స్థానే అధునాతన కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్స్ (ఏటీసీ)గా మార్చడం ద్వారా ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. ఇందుకోసం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో ఒప్పందం చేసుకుంది. ఉపాధే లక్ష్యంగా శిక్షణ అందించి టీటీఎల్ సంస్థలోనే ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. దీంతో ఐటీఐలు అంటేనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చిన్న చూపు చూసే పరిస్థితి మారనుంది. రాష్ట్రంలో 64 ఐటీఐలను ఎంపిక చేసి రూ.2,225 కోట్లతో నూతన భవనాలు, అధునాతన పరికరాలను సమకూర్చనున్నారు. ఇందులో 25 ఐటీఐలను ఏటీసీలుగా మార్చి పనులు ప్రారంభించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాలుగు ఐటీఐలు ఏటీసీలుగా మారనున్నాయి.

ఖమ్మం నగరంలోని టేకులపల్లి ఐటీఐ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రుద్రంపూర్ ఐటీఐ, మణుగూరు ఐటీఐ, కృష్ణసాగర్ ఐటీఐ... ఇకనుంచి ఏటీసీలుగా మారనున్నాయి. ఖమ్మం టేకులపల్లి ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నూతనంగా ఏటీసీ భవనాన్ని నిర్మించేందుకు పునాది పనులు మొదలయ్యాయి. ఒక్కొక్క దానిపై రూ.4.77కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. టాటా టెక్నాలజీ లిమిటెడ్ (టీటీఎల్) సహకారంతో వీటిని అప్‌గ్రేడ్ చేస్తారు.

ఐటీఐ సర్కిల్ డెవలప్‌మెంట్ ఆప్షన్ ప్రాజెక్టులో భాగంగా ఐటీఐలలో ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పదో తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఇందులో అధునాతన సామగ్రిని, సాంకేతికతను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక నిపుణులతో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఆరు అధునాతన ట్రేడ్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్ కోర్సు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ కోర్సు, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సు, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైడ్ కోర్సు, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్ కోర్సు, మెకానిల్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ కోర్సు అందుబాటులోకి రానున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ కోర్సుల్లో చేరవచ్చు. వీటిని విజయవంతంగా పూర్తి చేస్తే అప్రెంటీస్ దశ లోనే సంబంధిత కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

ఐటీఐలలో చాలాకాలంగా ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ప్లంబర్, వెల్డర్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, టర్నర్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, కంప్యూటర్ ఆపరేటర్ తదితర కోర్సులను నిర్వహిస్తున్నారు. వీటిలో చాలా కోర్సులకు కాలం చెల్లింది. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశ పెట్టకపోవడంతో ఐటీలకు ఆదరణ తగ్గింది. అనేక ప్రైవేటు ఐటీఐలు మూసివేతకు గురయ్యాయి. ఒకప్పుడు ఐటీఐలు ఉపాధికి దారిచూపే కేంద్రాలుగా ఉండేవి. కేవలం పదో తరగతి అర్హతతో సాంకేతిక విద్యను అభ్యసించడం ద్వారా వేలాదిమంది విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. అయితే కాలానికి అనుగుణంగా కోర్సుల్లో మార్పులు చేయకపోవడంతో ఆదరణ తగ్గింది. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐటీఐలపై దృష్టి సారించింది. వీటిని ఏటీసీలుగా మార్చడం ద్వారా కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకువస్తోంది. ప్రతిష్ఠాత్మక టీటీఎల్ సంస్థ సహకారంతో ఈ ప్రాజెక్టు చేపట్టడం ఆసక్తిరేపుతోంది.

ఏటీసీ పనుల ప్రారంభం

ఖమ్మం నగరంలోని టేకులపల్లి గల ఐటీఐలో టాటా టెక్నాలజీస్ వారి సహకారంతో ఏటీసీ పనులు మొదలయ్యాయి. అధునాతన పరికరాలకు, భవన నిర్మాణానికి రూ.4.77కోట్లు వెచ్చిస్తున్నారు. గత నెలలో పరికరాలు రాగా, వాటిని పాత భవనంలోనే ఏర్పాటు చేశారు. నూతన భవనం అందుబాటులోకి రావడానికి మరో నాలుగు నెలలు పట్టనుండటంతో ప్రస్తుతం పాత భవనంలోనే శిక్షణ అందించనున్నారు. కొత్త కోర్సుల శిక్షణకు టాటా సంస్థ నుంచి అధ్యాపకులు రానున్నారు. భవనం పూర్తికాగానే పూర్తిస్థాయి శిక్షణ అందించనున్నారు. భద్రాద్రి జిల్లాలోని మూడు ఏటీసీలలో భవన నిర్మాణ పనులు ప్రారంభం కాగా, అధునాతన పరికరాలు రావాల్సి ఉంది.

కొత్త కోర్సులతో ఉపాధి అవకాశాలు

ఆవునూరి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ, ఖమ్మం



పరిశ్రమల్లో ఉద్యోగాల డిమాండ్ మేరకు ఏటీసీల్లో ఆరు కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులు. ఈ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు అప్రెంటీస్ దశలోనే ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయి. ఖమ్మం టేకులపల్లి ఏటీసీలో నూతన కోర్సులకు సంబంధించి 2024-25 విద్యా సంవత్సరానికి ఆగస్టులో అడ్మిషన్ల ప్రక్రియ చేపడతాం. పదో తరగతి విద్యార్థులకు ఆరు నూతన కోర్సులు, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు మరో 23 కోర్సులు మూడు, ఆరు నెలల వ్యవధిలో శిక్షణ అందించటం జరుగుతుంది.

షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైల్లో దోపిడీ

- అర్ధరాత్రి మూడు బోగీల్లో దొంగల హల్‌చల్
- బాధితుల్లో ఒకరిది ఖమ్మం జిల్లా.. ఇద్దరిది ఎన్టీఆర్ జిల్లా
- ఖమ్మం రైల్వే పోలీసులకు ఫిర్యాదు

6

క్రాప్ లోన్ రెన్యూవల్‌పై కిరికిరి

- రైతులకు సంకెళ్లుగా మారిన టెస్కాబ్ ఆదేశాలు
- రుణ వితరణకు చుక్కలు చూపిస్తున్న సొసైటీలు
- నో డ్యూ కోసం బ్యాంకుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

6

గురుకులంలో వసతి కష్టాలు

- మూడున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు శిథిలావస్థలో
- ఎన్టీఆర్ 'మానస పుత్రిక' దుస్థితి



సీఎం రేవంత్‌రెడ్డి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యేలు వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, కనకయ్య, వెంకట్రావు

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని
సెలవుగా ప్రకటించాలి

- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు, జూలై 26: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగస్టు 9వ తేదీన ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో గిరిజన ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సెలవుగా ప్రకటించడంతో పాటు ఆదివాసీల మనుగడకు, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, జారే ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో పినపాక ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణాలోని ఆదివాసీ ఎమ్మెల్యేలను కలుపుకొని ఆదివాసీ దినోత్సవాన్ని సెలవుగా ప్రకటించాలని కోరడం నియోజకవర్గ ఆదివాసీ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

గురుకులంలో వసతి కష్టాలు

- మూడున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు
- శిథిలావస్థలో పెచ్చులూడుతున్న నిర్మాణాలు
- విద్యార్థుల సంఖ్య పెరిగినా గదుల నిర్మాణం లేదు
- ఎన్టీఆర్ మానస పుత్రిక గురుకులం దుస్థితి

వైరా, జూలై 26: వైరా నడిబొడ్డున ఉన్న తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఉమ్మడి ఏపీలో మూడున్నర దశాబ్దాల క్రితం నాటి విద్యార్థుల సంఖ్యాపరంగా నిర్మించిన వసతి భవనాలే నేటికీ దిక్కయ్యాయి. విద్యార్థుల సంఖ్య రెండు, మూడు రెట్లు పెరిగినా వసతి భవనాలు మాత్రం ఇంతవరకు నిర్మించలేదు. ఇరుకైన వసతి భవనంలోనే విద్యార్థులు తీవ్ర అసౌకర్యాల మధ్య గడపాల్సిన దుస్థితి నెలకొంది.

వైరాలోని బాలికల గురుకులంలో మూడున్నర దశాబ్దాల క్రితం 240మంది విద్యార్థులకు సరిపడా వసతి భవనాలను(డార్మెటరీ)ని నిర్మించారు. మొదట 5నుంచి 10వతరగతి విద్యార్థుల వరకే ఈ గురుకులాన్ని ప్రారంభించారు. ఇప్పుడు ఈ గురుకులంలో బైపీసీ, ఎంపీసీ ఇంటర్మీడియేట్ విద్యార్థులతో జూనియర్ కళాశాలను కూడా ఏర్పాటుచేశారు. ఫలితంగా పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య 640కి పెరిగింది. కాని భవన సామర్థ్యం పెరగలేదు. ఏటా 600మందికిపైగా విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులంతా చాలీచాలని రెండు వసతి భవనాల్లోనే తలదాచుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

ఈ భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షానికి శ్లాబ్ నుంచి నీరు లీకవుతోంది. శ్లాబ్ పెచ్చులూడిపోయి ఇనుప చువ్వలు బయటకు దర్శనమిస్తున్నాయి. గత ఏడాదే జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ శిథిలావస్థలకు చేరుకున్న ఈ భవనాలను పరిశీలించి తన పరిధిలో ఉన్న నిధులను మంజూరు చేసి శిథిలావస్థలో వసతి భవనాలపైనే రేకుల షెడ్ ఏర్పాటు చేశారు. ఈ రేకుల షెడ్ కారణంగా వర్షం కురిసినా శ్లాబ్ నుంచి లీకేజీ నీరు మాత్రం ఆగిపోయింది.

ఈ గురుకులంలో 80మంది విద్యార్థులకు కనీసం బెడ్‌లు కూడా లేవు. దాంతో వారు తమ తోటి విద్యార్థినులతో సర్దుబాటు చేసుకోవడం, లేకుంటే కటికి నేలపై నిద్రిస్తున్నారు. ఒకవేళ 80మంది విద్యార్థులకు బెడ్లు ఇచ్చినా వాటిని వేసేందుకు అవసరమైన వసతి భవనం లేదు. దాంతో విద్యార్థులు తరగతి గదుల్లోనే నిద్రించాల్సిన దుస్థితి ఉంది. రాత్రివేళ వర్షం కురిస్తే వసతి భవనానికి వెళ్లేందుకు అవకాశం లేక విద్యార్థులు తరగతి గదుల్లోనే పడుకోవాల్సిన పరిస్థితులు ఇక్కడ ఉన్నాయి.

అధ్వానంగా భోజనశాల..

35ఏళ్లనాడు నిర్మించిన భోజన, వంటశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 240మంది విద్యార్థుల అవసరాలకు సరిపడా మాత్రమే నాడు వీటిని నిర్మించారు. ఇప్పుడు విద్యార్థుల సంఖ్య రెండు రెట్లు పెరిగింది. అరకొర భోజన శాల దిక్కుగా ఉంది. విద్యార్థులు ఒకరితర్వాత ఒకరు వేసి ఉండి భోజనాలు చేయాల్సి వస్తుంది. విద్యార్థులు ఉతికిన తమ దుస్తులను ఆరవేసుకొనేందుకు కూడా ఇక్కడ ఎలాంటి వసతులు లేవు.



కరవైన రక్షణ...

ఈ పాఠశాలలో 600మందికిపైగా విద్యార్థులు ఉంటున్నప్పటికీ రక్షణ చర్యలను గాలికి వదిలేశారు. ఈ వసతి భవనాల పక్కనే జాతీయ ప్రధాన రహదారి(తల్లాడ వైపు)ఉంది. ఈ వసతి భవనాలకు ఈ రోడ్డుకు మధ్య ఉన్న ప్రహరీగోడ ఎత్తు తగ్గిపోయింది. శిథిలావస్థకు చేరిన ప్రహరీ కేవలం మూడున్నర, నాలుగు అడుగుల ఎత్తులో ఉండి పలుచోట్ల కూలిపోయింది. రోడ్డుపైనుంచి ఈ గురుకులంలోకి ఎవరైనా అతి తేలిగ్గా ప్రవేశించే అవకాశముంది. ఈ పాఠశాల ఆవరణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉంది. విద్యార్థులు ఉపయోగించిన వ్యర్థజలాలు బయటకు వెళ్లే పరిస్థితి లేక మురుగునీరు ఆవరణంలోని పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. విద్యార్థులు వాడిన నీళ్లే కాకుండా వైరా ఏసీపీ కార్యాలయం మొదలుకొని ఆపరిసర ప్రాంతాల్లోని నీరు కూడా ఈ పాఠశాలలోకే వచ్చి చేరుతుండటంతో పరిసరాలన్నీ దుర్వాసనతో వెదజల్లుతున్నాయి. విద్యార్థులు అనారోగ్యం బారినపడుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న అరకొర వసతులతో ఉన్న భవనం

సమస్యలు పరిష్కరించండి

ఇక్కడి విద్యార్థుల అవసరాల నిమిత్తం యుద్ధప్రాతిపదికన మూడు వసతి భవనాలను నిర్మించాలి. డైనింగ్ హాల్ నిర్మించాలి. గురుకులంలో తరగతి గదులకు వసతి భవనాల మధ్య దాదాపు అరకిలోమీటర్ దూరం ఉన్నాయి. రాత్రి స్టడీ అవర్స్ తర్వాత విద్యార్థులు తరగతి గదుల నుంచి వసతి భవనాలకు వెళ్లేందుకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షం కురిసిన సమయంలో విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుంది. అందువలన అరకిలోమీటర్ సిమెంట్ కాంక్రీట్ రోడ్డును నిర్మించాలి. డ్రెయినేజీ నిర్మించి సమస్యకు పరిష్కారం చూపించాలి. వైరా ప్రాంతానికే చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రత్యేక చొరవ తీసుకొని దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మానస పుత్రిక అయిన ఈ గురుకులానికి అన్ని సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.





అటవీ భూముల్లో తొలగించిన చెట్లు, ట్రెంచ్ కొడుతున్న దృశ్యం

అటవీ భూములు అన్యాక్రాంతం

- గ్రామాల్లో కనుమరుగువుతున్న ఫారెస్టు భూమి
- ట్రెంచులు కొట్టి కంటితుడుపు చర్యలు..
- మొక్కలు నాటకపోవడంలో ఆంతర్యం ఏంటో..?
- ఓ అటవీ శాఖాధికారి, ఓ ప్రజాప్రతినిధికి పోడు భూమి బాధ్యతలు

పినపాక, జూలై 26: కంచే చేను మేస్తే కాచేదెవరు... అన్నట్లుంది పినపాక మండలంలోని అటవీ శాఖాధికారుల తీరు. బాధ్యతగా కాపాడాల్సిన అటవీ భూములను పోడు కొడుతున్నా, పోడు కొడుతున్నారన్న ఫిర్యాదులు అందినా తమకేమి పట్టనట్లు ఉండడం పట్ల అనేక అనుమానాలకు తావిస్తోంది. మండలంలోని ఏడూళ్లబయ్యారం రేంజ్ పరిధిలోని వెంకట్రావుపేట, పాండురంగాపురం, జగ్గారం, మద్దులగూడెం అటవీ భూముల్లో పోడుదారులు ఇష్టానుసారంగా పోడు కొడుతూ, చెట్లు, పుట్టలు తొలగించారు. సదరు అటవీ భూముల్లో సుమారు 100 ఎకరాలు అటవీ శాఖకు చెందినవేనని, రికార్డుల్లో ఉన్నప్పటికీ, కొందరు అటవీశాఖ లోని అధికారుల అండదండలతో పోడుకు తెగించి, ఆక్రమణకు పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫారెస్టు భూముల్లో పోడు ఆక్రమణలపై ఫిర్యాదులు అందగా, ఫారెస్టు అధికారులు సాహసించి, ఆక్రమణకు గురైన భూములను ఆసాంతం మినహాయించి, అంచుల వెంబడి ట్రెంచులు కొట్టి, తాము చర్యలు తీసుకున్నాం అంటూ సమస్యను పక్కదారి పట్టించేందుకే ఇలా చేశారనే విమర్శలు వినవస్తున్నాయి. పక్కాగా పకడ్బందీ చర్యలు తీసుకుంటే, ఆక్రమణకు గురైన భూములను ఎందుకు స్వాధీనం చేసుకోలేదని కొందరు ప్రశ్నిస్తున్నారు. స్వాధీన పరుచుకున్న అటవీభూముల్లో ఇంత వరకు మొక్కలు నాటకపోవడం, సరిహద్దులు పెట్టకపోవడంపై అంతర్యమేంటోనని, పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అటవీ శాఖాధికారి, ఓ ప్రజాప్రతినిధితో సంప్రదింపులు ?

అక్రమంగా కొడుతున్న పోడు భూములు, ఆక్రమించుకున్న అటవీ భూముల వ్యవహారంలో పోడుదారులు అటవీ శాఖతో ఓ ప్రజాప్రతినిధిని మధ్యవర్తిగా పెట్టుకుని, వ్యవహారం నడుపుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోడు ఆక్రమదారులకు ఇంతగా సహకరిస్తున్న ఆ అధికారులు, ప్రజాప్రతినిధి ఎవరన్న చర్చకు ఉన్నతాధికారులు సమాధానమిస్తారా లేదా చూడాలి. తంతుపై లోతుగా ఆరా తీసి, అన్యాక్రాంతమవుతున్న పోడు భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పాత నేరస్థుడు..
కొత్త దొంగతనాలు

- 30 చోరీ కేసుల్లో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- రూ.21లక్షల సొత్తు రికవరీ

ఖమ్మం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో నివాసం ఉంటూ పలు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డాడు. అరెస్ట్ చేసి రిమాండ్ చేసినా.. బయటకు వచ్చి మళ్లీ దొంగతనాలు మొదలుపెట్టాడు. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే 30కి పైగా చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న దొంగను శుక్రవారం ఖమ్మం సీసీఎస్, త్రీటౌన్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. కాగా దానికి సంబంధించిన వివరాలను ఖమ్మం నగర ఏసీపీ ఎస్‌వీ రమణమూర్తి, సీసీఎస్ ఏసీపీ ఎం. భోజరాజులు వెల్లడించారు. గత నెలలో ఇంటికి తాళం వేసి వెళ్లి తిరిగి ఐదు రోజుల తర్వాత రాగా ఇంటి ముందు తలుపు పగలగొట్టి బంగారు ఆభరణాలు దొంగిలించారంటూ ఖమ్మం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి పాత నేరస్థులపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో సీపీ సునీల్‌దత్ ఆదేశాలకనుగుణంగా శుక్రవారం ఉదయం సీసీఎస్, త్రీటౌన్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపారు.

నగరంలోని పాండురంగాపురానికి చెందిన పాత నేరస్థుడు సంపటి ఉమాప్రసాద్ గాంధీచౌక్‌లో అనుమానస్పదంగా తిరుగుతుండగా పట్టుకుని విచారించినట్లు తెలిపారు. విచారణలో నగరంలోని త్రీటౌన్‌లోని కేసుతోపాటు, ఖమ్మం ఖానాపురం హవేలీ స్టేషన్ పరిధిలో రెండు, టౌటౌన్‌లో మూడు, వైరా పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కేసుల్లో దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించగా.. అతనివద్ద నుంచి రూ. 21 లక్షల విలువ చేసే 289 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆయా కేసుల్లో నగదుతో హైదరాబాద్‌లో రూ. 1.20 లక్షలు పెట్టి ద్విచక్ర వాహనం కొనుగోలు చేసినట్లు దానిని త్వరలో రికవరీ చేస్తామన్నారు. కేరళలో, సూర్యాపేట, హైద్రాబాద్, ఖమ్మం ప్రాంతాల్లో సుమారు 30కి పైగా చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లుగా వారు పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు కృషిచేసిన ఇన్‌స్పెక్టర్లు బి.బాలాజీ, బి.రాజు, త్రీ టౌన్ ఎస్‌హెచ్‌వో డి.రమేష్, సిబ్బంది మంగిత్యా, గజేంద్ర, పి. శ్రీనివాస్, సుధాకర్, కె.శ్రీనివాస్‌ను వారు అభినందించారు.

గంజాయి రహితంగా మార్చేందుకు
బాధ్యతగా వ్యవహరించాలి

- భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజ్

కొత్తగూడెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు పోలీస్‌శాఖతో పాటు జిల్లా ప్రజలు కూడా సమాచారం అందిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో ఎవరైన నిషేధిత గంజాయిని రవాణా చేస్తున్నట్లు కానీ విక్రయిస్తునట్లు కానీ సేవిస్తున్నట్లు కానీ సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో అలవాటుగా యువకులు గంజాయి సేవించే ప్రదేశాలను గర్తించామని, గంజాయిని సేవిస్తూ ఎవరైన కనపడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గంజాయి రవాణా, విక్రయం, వినియోగాలకు సంబంధించి సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. జిల్లాలో గంజాయిని నివారించడానికి ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఎస్పీ తెలిపారు.

న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించాలి

పాల్వంచ/ పాల్వంచ రూరల్ జూలై 26: పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించాలని ఎస్పీ రోహిత్‌రాజ్ పోలీస్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ముందుగా టీఎస్ఎస్పీ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్టేషన్ లోని పలు రికార్డులను పరిశీలించారు. పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు.డయల్ 100 కు తక్షణమే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని బాదితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రజలకు అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మావోయిస్టుల కదలికలపై కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, ఎస్పీ సీఐ నాగరాజు, రూరల్ ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.



పాల్వంచ రూరల్ ఎస్ఐ శ్రీనివాస్‌కు సూచనలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

నేడు అయ్యప్ప ధర్మ ప్రచారసభ సమావేశం

ఖమ్మం కార్పొరేషన్, జూలై26: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచారసభ తెలంగాణా రాష్ట్ర జనరల్‌బాడీ సమావేశం శనివారం మధ్యాహ్నం 1గంటలకు నగరంలోని మినర్వా గ్రాండ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమలరావు, కార్యదర్శి టి. పుల్లంరాజు తెలిపారు. శుక్రవారం నగర మేయర్ పునుకొల్లు నీరజకు శుక్రవారం ఆహ్వానపత్రికను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9గంటలకు జాతీయస్థాయి జనరల్‌బాడీ సమావేశం ఇదే వేదికపై నిర్వహించనున్నట్లు తెలిపారు.

గోదావరి దోబూచులాట..

- ఒకసారి తగ్గుతూ.. మరోసారి పెరుగుతూ..
- తాజాగా మళ్లీ రెండో ప్రమాద హెచ్చరిక జారీ

భద్రాచలం, జూలై 26 : భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతూ తగ్గుతూ మళ్లీ పెరుగుతూ దోబూచులాడుతోంది. ప్రతీ ఏటా వర్షాకాలం వరదల సమయంలో గోదావరి భద్రాచలం వద్ద దోబూచులాడటం సర్వసాధారణమైంది. ఈ నెల 21న క్రమక్రమంగా పెరుగుతూ వచ్చిన గోదావరి 43 అడుగుల మొదటి ప్రమాద హెచ్చరికను దాటింది. 22న 48 అడుగుల రెండో ప్రమాద హెచ్చరికను దాటి 50అడుగులకు చేరుకుంది. అనంతరం మళ్లీ పెరుగుతూ వస్తున్న గోదావరి 23న 51.6 అడుగులకు ఈ సీజన్‌లో గరిష్ఠంగా చేరుకొని అనంతరం కొద్ది సమయంపాటు నిలకడగా ఉంది. మళ్లీ తగ్గుముఖం పట్టిన గోదావరి నీటిమట్టం 24న 44 అడుగులకు తగ్గుముఖం పట్టి మళ్లీ కొద్దిసేపు నిలకడగా ఉన్న గోదావరి నీటిమట్టం మళ్లీ పెరుగుతూ రెండో ప్రమాద హెచ్చరికను 25వ తేదీన అర్ధరాత్రి 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు మళ్లీ పెరుగుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం సాయంత్రం 5 గంటలకు 48.6 అడుగులకు చేరుకుంది.

అక్కడ నుంచి 10 గంటల వరకు నిలకడగా ఉన్న గోదావరి నీటిమట్టం మళ్లీ క్రమేపి తగ్గుతూ వచ్చింది. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు 47.8 అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఉదయం 6గంటలకు 47.4 అడుగులకు తగ్గిన గోదావరి నీటిమట్టం 11 గంటలకు 47 అడుగులకు తగ్గింది. మళ్లీ నాలుగు గంటల పాటు నిలకడగా ఉన్న గోదావరి సాయంత్రం 5 గంటలకు 47.1 అడుగుకు పెరిగింది. సాయంత్రం 6 గంటలకు 47.3 అడుగులకు మళ్లీ పెరగ్గా రాత్రి 48 అడుగులకు చేరడంతో మరోసారి రెండో ప్రమాద హెచ్చరికను భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు జారీ చేశారు.

భద్రాచలం వద్ద గోదావరిలో వరద రాత్రి 11గంటలకు 48.6కు నీటిమట్టం చేరింది. ఉదయానికి 50 అడుగులకు చేరే అవకాశం ఉంది.

2022లో సైతం గోదావరి జూలై, ఆగస్టు నెలల్లో ఇదే రీతిలో పెరుగుతూ తగ్గుతూ నిలకడగా మళ్లీ పెరుగుతూ వచ్చింది. ఈ విధంగా సుమారు 30 రోజులపాటు భద్రాచలం వద్ద గోదావరి దోబూచులాడింది. మళ్లీ తాజాగా ఈ నెల 21 నుంచి గోదావరి మొదటి ప్రమాద హెచ్చరికపైనే కొనసాగుతూ రెండు, మూడు ప్రమాద హెచ్చరికల మధ్య దోబూచులాడుతోంది.

ఇదిలా ఉండగా గోదావరి 49 అడుగుల్లోపు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మళ్లీ నిలకడగా ఉండి తగ్గే అవకాశం ఉందన్నారు. శబరిపోటు సైతం లేకపోవడంతో ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు ఉండవని అంచనా వేస్తున్నారు. కాగా, ఎనిమిది రోజులుగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తుండటం, వర్షాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా కురుస్తుండటంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలానికి భక్తుల రాక తగ్గింది. దీంతో రామాలయం సమీపంలోని చప్టా దిగువలో వ్యాపారాలే సాగడం లేదని చిరు వ్యాపారులు వాపోతున్నారు.



నీట మునిగిన దేవస్థానం కల్యాణకట్ట కింది భాగం



భద్రాద్రి వద్ద ఉధృతంగా గోదావరి

క్రాప్ లోన్ రెన్యూవల్‌పై కిరికిరి

- రైతులకు సంకెళ్లుగా మారిన టెస్కాబ్ ఆదేశాలు

వైరా, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రూ. 2 లక్షల రుణమాఫీ పథకాన్ని తెలంగాణ సహకార సొసైటీ టెస్కాబ్ అపహాస్యం పాల్జేస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులకు అన్నివిధాలుగా సహకారాన్ని అందించాల్సిన సహకార సంఘాలు నిబంధనల పేరుతో వారిని ముప్పుతిప్పలు పెడుతున్నాయి. అనేక వ్యయప్రయాసలకు గురవుతున్నారు. వాణిజ్య, గ్రామీణ బ్యాంకులు రైతులకు పంట రుణాల రెన్యూవల్ చేసే విషయంలో కొంత ఉదారంగా వ్యవహరిస్తుండగా సహకార సంఘాలు మాత్రం వారిని ముప్పుతిప్పలు పెడుతూ మూడు చెరువుల నీళ్ల తాగిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.

నో డ్యూ సర్టిఫికెట్ (బాకీ లేదని ధ్రువపత్రం) విధిగా ఉంటేనే రుణమాఫీ వర్తించిన రైతుల పంటరుణాలను సహకార సంఘాల్లో రెన్యూవల్ చేస్తామని నిబంధన విధించడంతో రైతులు అవాక్కవుతున్నారు. టెస్కాబ్ నుంచి వచ్చిన ఆదేశాలను తాము అమలు చేస్తున్నామే తప్ప తమ సొంత నిర్ణయాలను రైతులపై రుద్దటం లేదని సహకార సంఘాల యాజమాన్యాలు, సిబ్బంది స్పష్టం చేస్తున్నాయి. రూ.2 లక్షల రుణమాఫీలో భాగంగా ఈనెల 18న సీఎం రేవంత్‌రెడ్డి మొదటి విడతగా రూ.లక్ష రుణమాఫీ నిధులను విడుదల చేశారు. సహకార సంఘాల్లో అప్పులున్న రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ అయ్యాయి. రుణమాఫీ వర్తించిన రైతులకు తిరిగి వెంటనే పంటరుణాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.

అయితే రుణమాఫీ వచ్చిన రైతులకు ఎలాంటి నిబంధన లేకుండా వెంటనే రుణాలను ఇవ్వాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా టెస్కాబ్ నిబంధనలు ఉండటంతో సహకార సంఘాల వారు రైతులను నోడ్యూ సర్టిఫికెట్‌తోపాటు పలురకాల ధ్రువీకరణ పత్రాల కోసం డిమాండ్ చేస్తున్నారు. తాము అడిగిన ధ్రువపత్రాలను సమర్పించిన రైతులకు మాత్రమే రుణాలను రెన్యూవల్ చేస్తున్నారు. అయితే వాణిజ్య, గ్రామీణ బ్యాంకుల్లో మాత్రం రుణమాఫీ వచ్చిన రైతులకు కొత్తగా నో డ్యూ సర్టిఫికెట్‌తో సంబంధం లేకుండా ఒకట్రెండు ధ్రువపత్రాలతో వెంటనే పంటరుణాలను రెన్యూవల్ చేస్తున్నాయి. సహకార సంఘాల్లో మాత్రం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది.

ఈనెల 20వతేదీన టెస్కాబ్ 314సర్క్యులర్‌ను జారీ చేసింది. సర్క్యులర్ మేరకు రుణాలు రెన్యూవల్ చేయాలని ఈనెల 24వతేదీన ఖమ్మం డీసీసీబీ ఆర్‌సీనెంబర్ 560 సర్క్యులర్‌ను విడుదల చేసింది. టెస్కాబ్ విడుదల చేసిన సర్క్యులర్‌లో ఉన్న నిబంధనలు ఇలా ఉన్నాయి. లోన్ అప్లికేషన్ ఫారం, ఒరిజనల్ పట్టాదారు పాస్‌పుస్తకం, 1-బీ, పహనీ, 15ఏళ్లకు సంబంధించిన ధరణి ఈసీ, సిబిల్ రిపోర్టు/క్రెడిట్ స్కోర్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు లేక ఓటర్ ఐడీ కార్డు, డీసీసీబీ సేవింగ్ బ్యాంకు పాస్‌బుక్ జీరాక్స్, నాలుగు పాస్‌పోర్టుసైజు ఫొటోలతోపాటు నోడ్యూ సర్టిఫికెట్‌ను రైతులు విధిగా సమర్పించాలని స్పష్టం చేసింది. అయితే సహకార సంఘాల వారు ఒరిజనల్ పట్టాదారు పాస్‌బుక్, 1-బీ, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జీరాక్స్‌లతోపాటు నో డ్యూ సర్టిఫికెట్‌ను విధిగా సమర్పిస్తేనే లోన్ రెన్యూవల్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రాష్ట్రం మొత్తంమీద సహకార సంఘాల్లో జరిగే పంటరుణాల రెన్యూవల్‌కు టెస్కాబ్ నిబంధనలు తలనొప్పిగా మారాయి. ఇప్పటికైనా వాణిజ్య, గ్రామీణ బ్యాంకుల తీరును గుర్తించి టెస్కాబ్ కూడా నో డ్యూతో సంబంధం లేకుండా సహకార సంఘాల్లో పంటరుణాలు రెన్యూవల్ చేసేవిధంగా ఆదేశాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

సైనికుల త్యాగాలు మరువలేనివి

- కార్గిల్ విజయ్ దివస్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



నివాళులర్పిస్తున్న కలెక్టర్

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 26: సైనికుల త్యాగాలు మరువలేనివని వారి సేవలను ఎప్పటికి స్మరించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద గల ఫ్రీడం పార్కులో అమర జవాన్ల స్థూపం వద్ద చేపట్టిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సైనికులు మన కోసం, దేశం కోసం సరిహద్దుల్లో ప్రాణాలను లెక్క చేయకుండా మన కోసం ప్రహారా కాస్తున్నారని అన్నారు. ఎండను, మంచును లెక్క చేయకుండా కాపలా ఉంటూ త్యాగాలు చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా అమర జవాన్ల స్థూపం వద్ద కార్గిల్ యుద్ధంలో మరణించిన సైనికులకు ఆయన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా సైనిక సంక్షేమ అధికారి చంద్రశేఖర్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ నవీన్‌యాదవ్, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు మహబూబ్ సుబాని, సెక్రెటరీ కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు సురేష్‌బాబు, వింగ్ కమాండర్ సురేంద్ర పాల్గొన్నారు.

షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలులో దోపిడీ

ఖమ్మం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): షిర్డీ దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో షిర్డీ- కాకినాడ పోర్టు రైలు ఎక్కిన పలువురు ప్రయాణికులపై దొంగలు విరుచుకుపడ్డారు. ప్రయాణికులు నిద్రమత్తులో ఉండగానే బంగారం, నగదు, హ్యాండ్ బ్యాగులు, లగేజీ బ్యాగులు ఏది దొరికితే అది ఎత్తుకెళ్లారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత బీదర్ సమీపంలోని పల్లి రైల్వే స్టేషన్ సమీపంలో బాధితులు నిద్ర నుంచి తేరుకుని తమ సొత్తు చోరీకి గురైందని గుర్తించారు. అయినప్పటికీ బీదర్ వచ్చే వరకు తాము ఫిర్యాదు చేసేందుకుకానీ, తమ మొరను ఆలకించేవారే కరువయ్యారు. మూడు బోగీల్లో దొంగతనం జరిగినట్టుగా బాధితులు చెబుతుండగా.. సుమారు 30మందికి చెందిన సొత్తు విలువ రూ.30లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. బాధితుల్లో ముగ్గురు శుక్రవారం మధ్యాహ్నం ఖమ్మం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినపల్లికి చెందిన రావెళ్ల పద్మ 110 గ్రాముల బంగారం, రూ.10వేల నగదుతోపాటు సెల్ ఫోన్ చోరీకి గురైనట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన యర్రా శ్రీనివాసరావు రూ.20వేలు నగదు, సెల్‌ఫోన్, అదే మండలం చిల్లకల్లుకు చెందిన యర్రా వాణి రూ.20వేలు, సెల్‌ఫోన్, పలు విలువైన పత్రాలు, ఆధార్‌కార్డులు వంటివి చోరీకి గురైనట్టు ఫిర్యాదు చేశారు. కాగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదును జీవో ఎఫ్ఐఆర్‌గా నమోదు చేసి పల్లి జీఆర్‌పీ పోలీసులకు పంపనున్నట్టు ఖమ్మం రైల్వే పోలీసులు తెలిపారు.

అయితే తెల్లవారుజామున రెండు గంటల సమయంలో చోరీ జరిగినట్టు గుర్తించగా.. బీదర్ వచ్చేవరకు ఎవరూ పట్టించుకోలేదంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడినుంచి సికింద్రాబాద్ వెళ్లమని చెప్పారని, అక్కడి వారు ఖమ్మం వెళ్లి ఫిర్యాదు చేయమని చెప్పడంతో చివరకు ఖమ్మం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితులు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల పోస్టుల భర్తీకి

30న ఇంటర్వ్యూ: ప్రిన్సిపాల్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 26: వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్ట్ బేసిస్‌లో భర్తీకి 30న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. రాజేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్లు - 9, అసోసియేట్ ప్రొఫెసర్లు - 11, అసిస్టెంట్ ప్రొఫెసర్లు - 7, మొత్తం 27 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ ఖాళీలను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. ఇంటర్వ్యూలు ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల, ఖమ్మం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఖాళీలు, ఇతర వివరాలు కళాశాల వెబ్ సైట్‌లో పొందుపర్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో 8 ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 8 పోస్టులో పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోన్నట్లు ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. స్టాఫ్ నర్స్ పోస్టులు 5 అర్హత జనరల్ నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్ ఉండాలి వేతనంగా రూ.25,140 ఇవ్వనున్నారు. రేడియాలజీ టెక్నీషియన్ ఒక పోస్టుకు రేడియాలజీ అసిస్టెంట్ కోర్సు సర్టిఫికెట్ విధిగా ఉండాలి. దీనికి పారితోషికంగా రూ 22,750 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎఫ్ఎన్‌వో ఒకటి, ఎంఎన్‌వో ఒకటి వీటికి పదోతరగతి, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి, వీటిని కాగు రూ.15,600లు ఇవ్వనున్నట్లు తెలిపారు. బయోడేటా తో జనరల్ అభ్యర్థులు రూ.500 డీడీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.300 డీడీలను జతపరచాలన్నారు. దరఖా స్తులను ఈనెల 29న ఉదయం నుంచి ఆగస్టు 4 సాయంత్రం వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. వివరాలకు మెడికల్ సూపరిన్‌టెండెంట్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వెదజల్లే పద్ధతి వైపు రైతుల మొగ్గు

- వరి సాగులో పెట్టుబడి ఖర్చు తగ్గుతుండటంతో అన్నదాతల చూపు
- రైతులకు కలెక్టర్ అభినందనలు



విత్తనాలు వెదజల్లుతున్న రైతులు, రేజర్లలో వెదజల్లే పద్ధతిలో సాగుచేసిన పైరును పరిశీలిస్తున్న కలెక్టర్(ఫైల్)

తల్లాడ, జూలై 26: కూలీల ఖర్చు, పెట్టుబడి ఆదా.. విత్తన మోతాదు తగ్గుతుండటంతో వరిసాగులో వెదజల్లే పద్ధతి వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్నెస్పీ), చెరువులు, బావులు, బోర్లు, విద్యుత్ మోటార్ల కింద తల్లాడ మండలంలో 22,890ఎకరాల వరిసాగు ఆయకట్టు ఉంది. ప్రస్తుత వానాకాలం వ్యవసాయ సీజన్‌లో ఇప్పటివరకు తల్లాడ మండలంలో 12వేల ఎకరాల్లో వరిసాగుచేశారు. ఇందులో అత్యధికంగా 8వేల ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో వరిసాగుచేశారు. వెదజల్లే పద్ధతిలో కూడా పొడి దుక్కులు, వరి విత్తనాలు చల్లే పద్ధతిని కొందరు రైతులు అనుసరిస్తున్నారు. గతంలో సాధారణ పద్ధతిలో వరినాట్లు వేయడం వల్ల నారుమడి దున్నడం, 25కిలోల విత్తనం, నారుమడిలో విత్తనం చల్లినందుకు కూలీ ఖర్చు, నెలరోజులపాటు నారుమడి సస్యరక్షణ చర్యలు, నాటు వేసేటప్పుడు నారుమడి నుంచి పొలంలోకి నారు తరలించడం, నాటు వేసేందుకు కూలీల ఖర్చు వంటివి ఎకరాకు రూ.8వేల మేరకు పెట్టుబడి అయ్యేది. అయినప్పటికీ దమ్ముచేసిన వరిపొలంలో చదరపు మీటర్‌కు 35నుంచి 40మొక్కలు నాటాల్సి ఉన్నప్పటికీ కూలీలు సరిగా మొక్కలు పెట్టకపోవడం వల్ల పంట దిగుబడి తగ్గి రైతులు నష్టపోయే పరిస్థితి ఉండేది. దీనికి ప్రత్యామ్నాయంగా వరిసాగులో నేరుగా విత్తనం వెదజల్లే పద్ధతిని అనుసరించటం వల్ల ఎకరాకు 12నుంచి 15కిలోల మేరకు విత్తనం సరిపోతుంది. ఎకరంలో విత్తనం చల్లేందుకు కూలీకి రూ.300ఖర్చవుతుంది. పొడి దుక్కులో విత్తనం చల్లటం వల్ల వర్షం కురిసిన తర్వాత వెంటనే పైరు మొలకెత్తుతుంది. కోత పదిరోజులకు ముందే వస్తుంది. తల్లాడ మండలం రేజర్ల(అంజనాపురం) గ్రామంలో వెదజల్లే పద్ధతిలో సాగుచేసిన వరిపైరును ఇటీవల ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ పరిశీలించి రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. వరిసాగులో పెట్టుబడి తక్కువ కావడం వల్ల మేలుజరుగుతుందని, వరిసాగులో ఇటువంటి ప్రత్యామ్నాయ ఆధునిక సాగుపద్ధతుల పట్ల రైతులకు మరింత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వెదజల్లే పద్ధతిలో సాగు విస్తీర్ణం పెరుగుతుంది

ఎండీ.తాజుద్దీన్, ఏవో, తల్లాడ



తల్లాడ మండలంలో వానాకాలం వరిసాగు ప్రక్రియ కొనసాగుతుంది. ప్రస్తుతం ఎన్నెస్పీ ఆయకట్టు మినహాయించి చెరువులు, బావులు, బోర్లు, మోటర్ల కింద ఇప్పటికి 12వేల ఎకరాల్లో వరిసాగు జరిగింది. ఇందులో అత్యధికంగా 8వేల ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో సాగుచేస్తున్నారు. పెట్టుబడి ఆదా కావడం వల్ల వెదజల్లే పద్ధతిలో సాగు విస్తీర్ణం బాగా పెరుగుతుంది.

వెదజల్లే పద్ధతి ప్రయోజనకరంగా ఉంది

ఆపతి వెంకటరామారావు, రైతు, అన్నారుగూడెం



మాకు 14ఎకరాల్లో వరిపొలం ఉంది. బావులు, మోటర్ల ద్వారా సాగు నీటి వసతి ఉండటంతో వానాకాలం సీజన్‌లో 14ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో వరిసాగుచేశాము. తక్కువ విత్తనం, కూలీల ఖర్చు తగ్గి ఎకరాకు రూ.8వేల చొప్పున పెట్టుబడి ఆదా అవుతుంది. సాధారణంగా దమ్ము చేసి వరినాట్లు వేసే పద్ధతికి ప్రత్యామ్నాయంగా ప్రయోజనకరంగా ఉంది.

కల్లూరు

ఏఎంసీ చైర్మన్‌గా నీరజదేవి



నీరజ దేవి

కల్లూరు, జూలై 26: కల్లూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రైతు కుటుంబానికి చెందిన బాగం నీరజదేవితో పాటుగా నూతన పాలకవర్గం త్వరలో కొలువు దీరనున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదువలకు మోక్షం లభించినది. ఈ మేరకు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అనుచరుడైన కాంగ్రెస్ నాయకుడైన భాగం ప్రభాకర చౌదరి సతీమణి నీరజదేవిని ఏఎంసీ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. దీంతో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కూడా కల్లూరు ఏఎంసీ చైర్మన్ నీరజదేవితో పాటుగా పెనుబల్లి మండల కొండ్రుపాడు చెందిన రాజబోయన కోటేశ్వరరావును (బీసీ) వైస్ చైర్మన్‌గా ఎంపిక చేశారు. డైరెక్టర్లుగా పోతురాజు కిషోర్ (ఎస్సీ), మండలపాడు. బాణోతు బాలజీనాయక్ (ఎస్టీ), చంద్యాతండ. కర్రి వెంకటేశ్వరరావు (బీసీ), కొత్త కారాయిగూడెం. రెడ్డి వెంకటకృష్టారావు (బీసీ) చిన్నకోరుకొండి. లింగబోయిన పుల్లారావు(బీసీ) చంద్రుపట్ల, ఏటూకూరి హరీష్ చౌదరి (ఓసీ) తాళ్లపెంట, కర్నాటి శ్రీనువాసరెడ్డి (ఓసీ) చింతగూడెం, దేవరపల్లి నాగమణి (ఓసీ), లింగాల, దారా రామారావు(ఓసీ) కల్లూరు. దొడ్డపునేని శ్రీనువాసరావు (ఓసీ) ఎర్రబోయినపల్లి, బందేల మల్లేశ్వరరావు (బీసీ) పుల్లయ్యబంజరు, సయ్యద్ నబీ (ఓసీ) కల్లూరు లను పై విధంగా నూతన పాలక వర్గం ను ఆమోదిస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నుంచి నూతన పాలక వర్గంను ఆమోదిస్తూ ఆదేశాలు రానున్నాయని తెలిసింది. నూతన పాలకవర్గం లో తమను ఎంపిక చేసినందుకు ఏఎంసీ చైర్మన్ నీరజదేవితో పాటు డైరెక్టర్లు మంత్రులు తుమ్మల, పొంగులేటి, భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- మెనూ ప్రకారం భోజనం అందించాలి: ఐటీడీఏ పీవో రాహుల్



విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

గుండాల/ఆళ్లపల్లి, జూలై 26: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో మెనూ ప్రకారం పౌష్టికరమైన భోజనం అందించి విద్యార్థును చదువుతో పాటు వారికి ఇష్టమైన క్రీడల్లో తర్ఫీదు ఇవ్వాలని ఐటీడీఏ పీవో బీ రాహుల్ ఆదేశించారు. గురువారం రాత్రి కాచనపల్లి, అనంతోగు ఆశ్రమ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతోగు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత హెచ్ఎంకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. ఉపాధ్యా యులు, సిబ్బంది స్థానికంగా ఉండాలన్నారు. కమిషనర్ సూచనల మేరకు రాత్రిపూట ముగ్గురు ఉపాధ్యాయులు ఉండాలని తెలిపారు. తరగదులు, కిచెన్, డార్మెటరీ, డైనింగ్ హాలు పరిసరాలను పరిశీలించారు. రాత్రిపూట పిల్లలను బయటకు పంపకూడదని పూచించారు. విద్యార్థుల పా ఠ్యాంశ అంశాలను పరిశీలించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే హెచ్ఎం, ఉపాధ్యాయులకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు: పీవో

దుమ్ముగూడెం: గిరిజనులు ప్రకృతి వ్యవసాయం సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఐటీడీఏ పీఓ బి రాహుల్ అన్నారు. ఎన్‌లక్ష్మీపురంలో ప్రకృతి వ్యవసాయ పథకం అమలు తీరును శుక్రవారం పరిశీలించారు. తక్కువ పెట్టుబడితో ఆయిల్‌పాం, వేరుశనగ, ఉద్యానవన పంటల సాగు చేసి జీవనోపాధిని మెరుగు పర్చుకోవచ్చన్నారు. చేపల చెరువును పరిశీలించి ప్రమాదకర వ్యర్థాలతో పెంపకం చేయకూడదని, ప్రకృతి సిద్ధమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం గిరిజన రైతుల పంట పొలాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరాను పరిశీలించారు. వరదలకు కూలిపోయిన ఎన్‌లక్ష్మీపురం-సింగారం వంతెన పున: నిర్మాణ పనులను త్వరలోనే చేపడతామన్నారు. స్థానిక గిరిజన ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఏడీ భాస్కర్, ఏటీడీఓ అశోక్, ఏఈ మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

సింగరేణి లాభాల్లో 35శాతం వాటా చెల్లించండి

- సీఎండీ బలరాంకి ఏఐటీయూసీ వినతి



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కొత్తగూడెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణికి 2023- 24 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన నికర లాభాల నుంచి ప్రోత్సాహం కింద 35శాతం వాటా కార్మికులకు, ఉద్యోగులకు చెల్లించాలని సీఎండీ బలరాంనాయక్‌కు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజకుమార్‌లు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో సింగరేణి భవన్ లో సీఎండికి వినతిపత్రం అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణిలో 24 ఏళ్లుగా బొగ్గు ఉత్ప త్తి, ఉత్పాదకతను పెంచడం ద్వార సంస్థ లాభాల ను ఆర్జిస్తుందని వారు తెలిపారు. సింగరేణిలో ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులు, కార్మిక సంఘాలుచేసిన సమష్టి కృషి వల్ల బొగ్గు ఉత్పత్తి సాధ్యమైందని వారు పేర్కొన్నారు. సింగరేణిలో 2023-24 సంవత్సరానికి 70 మిలియన్ టన్నుల సాధించగలమని, కంపెనీ ద్వారా అధిక లాభాలను కూడా ఆర్జిస్తుందని వారు ఆశాభావం వ్యక్తంచేశారు. సింగరేణిలో 2022-23 ఆర్థిక సంవత్సరం లో 67.14 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించిం దని, 2222.46కోట్ల లాభాలను ఆర్జించిందని వారు గుర్తు చేశారు. రాబోయే సంవత్సరంలో మరింత ఉత్పత్తి, ఉత్పాదకతను పెంపొందించడానికి వారిని ప్రేరేపించేందు కు ఉద్యోగులకు, సిబ్బందికి ప్రత్యేక ప్రోత్సాహకం కింద నికర లాభాల్లో కనీసం 35శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రకటించడానికి ఏర్పాట్లు చేస్తూ వెంటనే చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అదేవిధంగా సింగరేణిలోపని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు వైద్య సౌకర్యం కల్పించేందుకు అన్ని ఏరియాల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా ఈఎస్ఐ హస్పటళ్ల ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని వారు కోరారు. సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 30లక్షల ప్రమాద భీమా సౌకర్యాన్ని అన్ని బ్యాంకుల్లో వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం అందచేసిన వారిలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ తదితరులు ఉన్నారు.

కేజీబీవీల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలి

●అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, జూలై 26: ఖమ్మం జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్‌హాల్లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల ప్రిన్సిపాళ్లతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 14 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు ఉన్నాయని వీటిలో 4775 మంది విద్యాభ్యసిస్తూ వసతి పొందుతున్నారన్నారు. విద్యాలయాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు వుండొదన్నారు. విద్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందజేయాలన్నారు. ప్రిన్సిపాళ్లు తమ జాబ్‌చార్ట్ ప్రకారం నడుచుకోవాలని ఆదేశించారు. బాలికలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అధికారులు షెడ్యూల్ ప్రకారం విద్యాలయాల తనిఖీలు చేపట్టాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ సమీక్షలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ, కేజీబీవీ జీసీడీవో భూలక్ష్మి కేజీబీవీ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

నకిలీ ఎంపీడీవో అరెస్టు

- ఇళ్లు కట్టిస్తానని చెప్పి పేదల నుంచి డబ్బులు వసూళ్లు



నకిలీ ఎంపీడీవోతో పెనుబల్లి పోలీసులు

పెనుబల్లి, జూలై 26: సమాజంలో ఉన్నత వ్యక్తుల పేర్లను ఉపయోగిస్తూ ఎంపీడీవోనని చెప్పుతున్న అద్దంకి జనార్ధన్‌రావు అనే వ్యక్తిని వీఎంబంజర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వీఎంబంజర్ ఎస్ఐ వెంకటేష్ తెలిపిన ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండల కేంద్రానికి చెందిన అద్దంకి జనార్ధన్‌రావు మచిలీపట్నం ఎంపీడీవోనంటూ పరిచయం చేసుకొని పెనుబల్లి మండలం పాత కుప్పెనకుంట్ల గ్రామంలో 20మంది పేదలకు ఇళ్లు కట్టిస్తామని ఈనెల 8న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి చేత శంకుస్థాపన కూడా చేయించాడు. తన ప్రవర్తనను అనుమానించిన ఎమ్మెల్యే రాగమయి పోలీసులను దర్యాప్తు చేయాలని సూచించారు.

ఈమేరకు పోలీసులు దర్యాప్తు చేస్తుండగా శుక్రవారం అదే గ్రామానికి చెందిన నారపోగు శ్రీనివాసరావు, బొల్లెపోగు రవికుమార్, కంటెపూడి ఏసు, నారపోగు నాగరాజులు రూ.4వేలు ఇవ్వాలని ఇప్పటికే ఇంటినిర్మాణానికి అవసరమైన మెటీరియల్ తోలించానని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.4వేలు జనార్ధన్‌రావు తీసుకున్నారు. నారపోగు శ్రీనివాసరావు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈమేరకు అతడ్ని అదుపులోకి తీసుకున్నామని, జనార్ధన్‌రావుపై 1992నుంచి ఎన్టీఆర్ జిల్లా వీరులపాడులో రెండు, నందిగామలో రెండు, ఇబ్రహీంపట్నంలో, తిరువూరులో, ఖమ్మంజిల్లా రూరల్ మండలంలో ఒక్కొక్క కేసులు నమోదయ్యాయని ఎస్ఐ తెలిపారు. జనార్ధన్‌రావును సత్తుపల్లి కోర్టుకు రిమాండ్ చేస్తున్నట్లు వివరించారు. డి.వెంకటేశ్వరరావు, పి.సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా మృత్యువుతో పోరాడి..

- చికిత్స పొందుతూ యువకుడి మృతి



ప్రవీణ్ (ఫైల్)

అశ్వాపురం జూలై 27: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై నాలుగు నెలలుగా మృత్యువుతో పోరాడిన ఓ యువకుడు శుక్రవారం మృతిచెందటంతో మండల పరిధిలోని నెల్లిపాక బంజరు గ్రామంలో విసాదం అలుముకుంది. సంఘటనకు సంబందించిన వివరాలిలా ఉన్నాయి. నెల్లిపాక బంజరు గ్రామానికి చెందిన కర్రి ప్రవీణ్(24) సారపాక ఐటీసీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈనే పథ్యంలో నాలుగు నెలల క్రితం విధులు ముగించుకుని వస్తూ మండల పరిధిలోని రామచంద్రాపురం వద్ద బైక్ అదుపుతప్పి తీవ్రగాయాల పాలయ్యాడు. పరిస్థితి విషమించటంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. చికిత్సకు రూ.15లక్షల వరకు ఖర్చు కావటంతో గ్రామస్థులే విరాళాలు వేసుకుని వైద్యం చేయించారు. అయినా ఫలితం లేక కోమాలోనుంచి బయటకు రాకపోవటంతో కుటుంబ సభ్యులు వైద్య ఖర్చులు భరించలేక ప్రవీణ్‌ను ఇంటికి తీసుకువచ్చారు. దీంతో పరిస్థితి విషమించి మృతిచెందాడు. ప్రవీణ్ తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. చేతికి అందివచ్చిన కొడుకు మృతిచెందటంతో తల్లి జయశ్రీ బోరున విలపించారు.

మొబైల్ వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 26: మొబైల్ ఫోన్ వినియోగం పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్కోప్ ఆర్డి డైరెక్టర్ ఎంఎల్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని వేణుగోపాల్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో స్కోప్ ఆర్డీ చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ ప్రసాద్, బాలల సంక్షేమ కమిటి సభ్యులు లింగయ్య, 55వ డివిజన్ కార్పోరేటర్ మోతారపు శ్రావణి హజరై మాట్లాడారు. బాలల అక్రమ రవాణా పెరుగుతుందని, పిల్లలు సాధ్యమైనంత వరకు మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. అత్యవసర సమయాల్లో 1098, 100, 1930 నెంబర్లకు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుడిపూడి శ్రీనివాసరావు, మోతారపు సుధాకర్, కోఆర్డినేటర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

చుంచుపల్లి, జూలై 26: గుండెపోటుతో విజయవాడ ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ జేమ్స్ (60) నిద్రలోనే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం మండలంలోని పెనగడప ప్రాంతంలో వాకింగ్ చేసిన అనంతరం ఏపీ16టిఎస్3338 నెంబర్ గల 14 టైర్ల లారీ ఎక్కి నిద్రపోయాడని స్థానికులు తెలిపారు. అనంతరం అక్కడే తిరుగుతున్న మరికొంతమంది లారీని పరిశీలించి చూడగా విఘతజీవిగా లారీలోని పడుకొని ముక్కులో నుంచి రక్తం వచ్చి ఉండడాన్ని గుర్తించారు. ఈ సమాచారాన్ని కొత్తగూడెం టూటౌన్ పోలీసులకు అందించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. లారీలో ఉన్న ఆధారాలనుసారం మృతుడు జేమ్స్ డ్రైవర్‌తో పాటు, ఆ లారీ యజమానిగా ఉన్నట్లు తెలుస్తుంది.

సీపీఎం సీనియర్ నాయకుడి మృతి



శంకర్ (ఫైల్)

ఇల్లెందు టౌన్, జూలై 26 : సీపీఎం ఇల్లెందు డివిజన్ నాయకులు కుకట్ల శంకర్ (65) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతోబాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుఝామున మృతి చెందాడు. సింగరేణిలో పని చేసిన నాటి నుంచి సీఐటీయూ యూనియన్‌లో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. ఆయన మృతి పట్ల సీపీఎం నాయకులు సంతాపం వ్యక్తంచేశారు. ఈ సంతాపసభలో సీపీఎం మండల కార్యదర్శి అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్‌రావు, ఆలేటి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

8 నుంచి ఓపెన్ స్కూల్స్ అడ్మిషన్లు ప్రారంభం

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 26: 2024-25 విద్యా సంవత్సరానికి సంబందించి దూర విద్యా విధానం లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో చేరేందుకు షెడ్యూల్‌ను శుక్రవారం డీఈవో సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ పాపారావు ప్రకటించారు. ఆగస్టు 8 నుంచి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభిస్తు న్నట్లు తెలి పారు. ఆగస్టు 31 నాటికి పదోతరగతికి 14 సంవత్సరాలు, ఇంటర్మీడియట్‌కు 15 సంవత్సరాలు వయస్సు నిండిన వారే అర్హులని తెలిపారు. పదోతరగ తికి జనరల్ పురు షులకు రూ.1550, ఇంటర్మీడియట్‌కు రూ. 1800, బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీ, దివ్యాంగులు, మహిళలకు పదోత రగతికి రూ. 1150, ఇంటర్మీడియట్‌కు రూ. 1500లు చెల్లించాలని తెలిపారు. ఆగస్టు 8 నుంచి సెప్టెంబర్ 10 వరకు ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు. వివరాలకు 8008403522 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

తపాలా ఎస్పీగా వీరభద్రస్వామి



వీరభద్రస్వామి

ఖమ్మం మామిళ్లగూడెం, జూలై 26: తపాలా ఎస్పీగా వి వీరభద్రస్వామి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడపని చేసిన రవికుమార్ వరంగల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్ణాటక రాష్ట్రం బీదర్ డివిజన్‌లో పనిచేస్తున్న వీరభద్రస్వామిని నియమించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఖమ్మం డివిజనల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనను పలువురు అభినందించారు. ఉద్యోగులు, పోస్టల్ సిబ్బందితో ఆయన మాట్లాడారు.

ఉద్యోగోన్నతి పొందిన ఎస్ఐలకు సీపీ అభినందన



ఎస్ఐలను అభినందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, జూలై 26: ఖమ్మం కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీసు స్టేషన్లలో ఏఎస్ఐలుగా విధులు నిర్వహిస్తూ పదోన్నతుల పొందిన పలువురిని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవలే కమిషనరేట్ పరిధిలో సీహెచ్ లింగయ్య, ఆర్. వెంకటరమణ, డి.బాలస్వామినాధం, ఎం.రామలింగారెడ్డి ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందారు. దీంతో సీపీ వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీ ప్రసాదరావు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 26: ఖమ్మం నగరంలోని ముస్తాఫానగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల లో 9వ తరగతి చదివే ఓ విద్యార్థిని పాఠశాలలోని ఓ ఉపాధ్యాయురాలు వేధిస్తుందని నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆ విద్యార్థిని నగరం లోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థిని తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. పాఠశాల యాజమా న్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు చేరుకొని పాఠశాల వద్ద ఘర్షణ జరగకుండ చర్యలు తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో

మతిస్థిమితంలేని వ్యక్తి మృతి

కొణిజర్ల, జూలై 26: గుర్తుతెలియని వాహనం ఢీకొని మతిస్థిమితంలేని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్‌రావు తెలిపిన వివరాలు ప్రకారం వైరా మండలం ముసలిమడుగు గ్రామానికి చెందిన రాచబంటి ముత్తయ్య (39) మతిస్థిమితంలేక రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో అక్కడకుఅక్కడే మృతి చెందాడు. ముత్తయ్య కొంతకాలంగా మతిస్థిమితం లేక తిరుగుతుంటుండగా ఇటీవల అన్నంఫౌండేషన్‌కు తీసుకెళ్లారు. ఆరోగ్యం కుదుటపడింది అనుకొని వారు ఇంటికి పంపించారు. ఇంటి నుంచి తల్లితో గొడవపడి గతంలో వలే ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అలా వెళ్లిన వ్యక్తి రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. తన కుమారుడు మతిస్థిమితంలేకనే రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందని, దాంతో మృతి చెందాడని మృతుడి తల్లి రాచబంటి వెంకటనర్సమ్మ ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని లారీ ఢీ కొని 12మేకలు మృతి

దమ్మపేట ,జూలై 26 : గుర్తుతెలియని లారీ ఢీకొట్టి 12మేకలు మృతి చెందిన ఘటన మండలపల్లి గ్రామసమీపంలో ప్రదాన రహదారిపై శుక్రవారం జరిగింది. మండలపల్లి గ్రామానికి చెందిన బాదితరైతు మీగడ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మేకలను దొడ్డి మార్చే క్రమంలో మేకలు రోడ్డు దాటుతుండగా అశ్వారావుపేట నుండి సత్తుపల్లి వైపు వేగంగా వెళుతున్న లారీ మేకలమందను ఢీకొట్టిందని వీటిలో 12మేకలు అక్కడిక్కడే మృతి చెందాయన్నారు. వీటి విలువ రూ.1.20వేలు వుంటాయని బాదితుడు ఆవేదన వ్యక్తం చేసారు. బాదితుడు పోలీసులకు పిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

పోలీసుల అదుపులో ఘరానా దొంగ

- పాల్వంచలో వరుస దొంగతనాలకు పాల్పడిన దొంగ అరెస్ట్
- 12 తులాలు బంగారం, 3కేజీల వెండి స్వాధీనం..



వివరాలు వెల్లడిస్తున్న సీఐ


పాల్వంచ, జూలై 26: పాల్వంచలో ఏప్రిల్, మే నెలల్లో వరుస దొంగతనాలు చేసి తప్పించుకు తిరుగుతున్న ఘరానా దొంగను ఎట్టకేలకు పాల్వంచ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. పాల్వంచ శాస్త్రీ రోడ్‌లో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పాల్వంచ అదనపు ఎస్ఐ రాఘవయ్య అనుమానాస్పదంగా కనిపించిన చింతల దుర్గాప్రసాద్‌ను పట్టుకుని విచారించగా పాల్వంచలో పలు చోరీలకు ప్పాడినట్లు అంగీకరించాడు. దీంతో అతనిని స్టేషన్‌కు తరలించి అతని వద్ద నుంచి 12 తులాల బంగారు ఆభరణాలు, 3 కేజీల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ ఈ విషయాలను మీడియా వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన చింతల దుర్గాప్రసాద్‌కు ప్రకాశం జిల్లాకు చెందిన ఆల్తాఫ్, పాల్వంచ వనమా కాలనీకి చెందిన వీరేందర్‌లతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతోనే ముగ్గురు కలిసి పాల్వంచ కాంట్రాక్టర్స్ కాలనీలో మూడు ఇళ్లలో, అయ్యప్పనగర్‌లో రెండు ఇళ్లలో ఏప్రిల్, మే నెలల్లో చోరీలకు పాల్పడ్డారు. వీరేందర్ సహకారంతో పగలు రిక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని వాటిలో దొంగతనాలు చేశారు. అప్పటి నుంచి వారు ముగ్గురూ పోలీసుల కళ్ళుకప్పి తప్పించుకుతిరుగుతున్నారు. గత నెలలో వీరేందర్ పాల్వంచ టౌన్ పోలీసులకు పట్టుబడగా ఆల్తాఫ్ కోదాడ పోలీసులకు పట్టుబడ్డారు. అప్పటి నుంచి దుర్గాప్రసాద్ కోసం గాలిస్తున్న పోలీసులు శుక్రవారం అనుకోని రీతిలో వెహికిల్ చెకింగ్‌లో పట్టుకుని అరెస్ట్ చేశారు. ఘరానా దొంగను పట్టుకున్న ఎస్ఐ, సిబ్బందిని పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ అభినందించారు.

180గ్రాముల ఎండుగంజాయి స్వాధీనం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 26: ఖమ్మం పరిధిలోని అల్లిపురంలో శుక్రవారం ఉదయం ఇద్దరి నుంచి 180గ్రాముల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వెళుతుండగా వారిని ఆపి తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో ఖమ్మం పరిధిలోని కొత్తగూడేనికి చెందిన తంబాల. ఉపేందర్, తూము. పురుషోత్తం నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలో సీఐ బీ.కృష్ణ, ఎస్ఐ కే. సాయిబాబా, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో కణుజు మృతి

కొణిజర్ల, జూలై 26: కుక్కలదాడిలో అడవి జంతువు అయిన కణుజు మృతి చెందిన సంఘటన ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలోని గుబ్బగుర్తి అటవీప్రాంతం పెద్దరాంపురం సమీపంలో జరిగింది. పెద్దరాంపురం ప్రాంతంలోనే అడవి పక్కన చేలల్లో కణుజును కుక్కలు వేటాడి చంపిన్నట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి రామా తెలిపారు. కణుజు మృతదేహన్ని పశువైద్యాధికారి సంజయ్‌రెడ్డి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అటవీ సిబ్బంది కనుజు మృతదేహాన్ని తీసుకెళ్లి దహనం చేశారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

శనివారం 27 జూలై 2024

పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని రాస్తారోకో

ములకలపల్లి, జూలై 26: ములకలపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు తమకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని ములకలపల్లి ప్రధాన సెంటరులో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. విద్యార్థుల తండ్రి పాపారావు తెలిపిన వివరాల ప్రకారం తన ఇద్దరు కుమారులు జీయో 7వ తరగతి, చిన్న కుమారుడు 6వ తరగతి జడ్పీహెచ్‌ఎస్ ములకలపల్లిలో కొత్తగా చేరారని, ములకలపల్లి ఎస్టీ బాలు హస్టల్‌లో ఉండి పాఠశాలకు వెళ్తున్నారని తెలిపారు. ఇంత వరకూ పాఠశాల వారు పాఠ్య పుస్తకాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. దీనిని నిరసిస్తూ.. ములకలపల్లి ప్రధాన సెంటరులో రాస్తారోకో చేశారు. ఈ విషయం తెలుసుకున్న జడ్పీహెచ్‌ఎస్ ప్రధాన ఉపాధ్యాయురాలు లత విద్యార్థుల వద్దకు వచ్చి మీరు కొత్తగా చేరారని అన్నారు. కాబట్టి పాత ఇండింట్ వరకు పుస్తకాలు వచ్చాయి వాటి ప్రకారం విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగిందని, మీ ఇద్దరికి నోట్ పుస్తకాలు ఇచ్చామని, రాగానే పాఠ్య పుస్తకాలు ఇస్తామని చెప్పి, విద్యార్థులచేత రాస్తారోకోను విరమింపచేశారు.

బ్లడ్ బ్యాంక్‌లో రక్తం కరువు

కొత్తగూడెం, ఖమ్మం నుంచి తెచ్చుకోవాల్సిన స్థితి..

రక్త నిల్వలు లేకపోవడంతో తొలుత కేంద్రం రద్దు..

డయాలసిస్ రోగులకు అవస్థలు

ఇల్లెందు టౌన్, జూలై 26: ప్రభుత్వ వైద్యశాలలో అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నట్లుగా ప్రచారా ఆర్భాటాలే తప్ప వైద్యసేవలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. ఏజెన్సీ కేంద్రమైన ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో పేరుకే రక్తనిల్వ కేంద్రం.. ఉన్నప్పటికీ ఎలాంటి రక్తనిల్వలు చేయలేక పోతున్నారు. అత్యవసరంగా వైద్యశాలలో రక్తం అవసరమైతే కొత్తగూడెం, ఖమ్మం వెళ్లే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ వైద్యశాలలో గతంలో ఒక పర్యాయం రక్తనిల్వ కేంద్రం ఏర్పాటుచేయగా రక్తం మాత్రం అందుబాటులో ఉండకపోవడంతో రక్తనిల్వ కేంద్రాన్ని రద్దు చేశారు. మరలా గత సంవత్సరం రక్త నిల్వ కేంద్రాన్ని మంజూరుచేసినప్పటికీ ఎలాంటి రక్తం నిల్వ చేయకుండానే కేవలం పేరుకు మాత్రమే రక్త నిల్వ కేంద్రం ఉన్నట్లుగా విమర్శలు ఉన్నాయి. రక్తం అత్యవసరంగా అవసరమయ్యే డయాలసిస్ రోగులతోపాటు బాలింతలకు అవసరమైనప్పుడు కొత్తగూడెం, ఖమ్మం సెంటర్లకే వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం 30 పడకల ఆసుపత్రి అయిన ఈ వైద్యశాలకు అనుసంధానంగా ఇల్లెందు, గుండాల, మల్లపల్లి, టేకులపల్లి మండలాల పీహెచ్‌సీల నుంచి రోగులు ప్రతిరోజు వస్తుంటారు. ఈ రోగులకు అవసరమైన రక్తం ఇల్లెందు వైద్యశాలలో లభ్యం కావడం లేదు. పేరుకే రక్తనిల్వ కేంద్రం ఉన్నప్పటికీ చుక్కపు బొట్టు రక్తం కూడా నిల్వచేసే సదుపాయం మాత్రం ప్రభుత్వం కల్పించలేదు. దీంతో పేద రోగులకు రక్తం ఒక అందని ద్రాక్షగానే మిగిలి పోతోంది. డయాలసిస్ రోగులకు ప్రతి నెల రక్తపరీక్షలతోపాటు ఇతర పరీక్షలు చేయాల్సి ఉన్నప్పటికి ఆ పరీక్షలు కూడా అందుబాటులో లేకపోవడంతో డయాలసిస్ రోగులు ఇబ్బందులకు గురువుతున్నారు. ఖమ్మం, కొత్తగూడెం లేకపోతే ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపరించింది. ప్రైవేట్‌లో డయాలసిస్ రోగులకు పరీక్షలు చేస్తే రూ.4వేల వరకు ఖర్చు అవుతుందని పలువురురోగులు పేర్కొంటున్నారు. డయాలసిస్ రోగులకు సైతం ఇదే వైద్యశాలలోనే ప్రతి నెల రక్తపరీక్షలు ఏర్పాటు చేయాలని, అదే విధంగా రక్తం ఎక్కించే విధంగా రక్తాన్ని అందుబాటులో ఉంచాలని పలువురు రోగులు కోరుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా ఈ విషయమై ఇల్లెందు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ బ్లడ్‌స్టోరేజీకి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించారు. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లామని, త్వరలోనే బ్లడ్‌బ్యాంక్ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.


మూతపడిన రక్త నిల్వ కేంద్రం


డయాలసిస్ కేంద్రం

ఎరువులు, విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రైతు న్యాయ చైతన్య సదస్సులో మెజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి


సదస్సులో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

మణుగూరుటౌన్, జూలై 26: వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని ఈ సమయంలో రైతులు వితనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలని మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ సూరిరెడ్డి కంభపు అన్నారు. శుక్రవారం గుట్టమల్లారంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు న్యాయ చైతన్య సదస్సులో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చేతికి అందకపోతే రైతులు పడే ఇబ్బందులు, పెట్టుపెట్టుబడి రాకా ఎదుర్కొని ఆర్థిక కష్టాలు తెలిసినవేనన్నారు. ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకూడదంటే విత్తనాలను, ఎరువు, పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో తక్కువ ధరకే వస్తున్నాయని, మోసపూరిత మాటలు నమ్మి ఎక్కువ సాగుబడి వస్తుందని ఆశతో నకిలీవి కొనుగోలు చేయవద్దన్నారు. అనుకోని పరిస్థితులు పంట ఎరువుల వల్లనో, నాటిన విత్తనాల వల్లనో నష్టం జరిగితే వినియోగదారుల కోర్టులను ఆశ్రయించి రైతులు నష్ట పరిహారం పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. వారికి సంబంధించిన ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. సదస్సులో బార్ అధ్యక్షుడు చిర్ర రవి, న్యాయవాదులు కుర్మ విజయరావు, సర్వేశ్వరరావు, పోశం భాస్కర్, రుద్ర వెంకట్, ఏడీపీ తాతారావు, ఏఓ రాంశివరావు పాల్గొన్నారు.

వాసవి మాతకు చీర, సారె సమర్పణ


చీర, సారెను సమర్పించేందుకు వెళుతున్న భక్తులు

దమ్మపేట, జూలై 26: ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరి మాతకు చీర సారే సమర్పించి పూజలు నిర్వహించారు. స్థానిక విజయమహాగణపతి, మర్రిభక్తాంజనేయ స్వామి వారి ఆలయం నుంచి మహిళా భక్తులు మేళతాళాలతో అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో వున్న వాసవీమాత ఆలయానికి చీర, సారెతో చేరుకొని అమ్మవారికి సమర్పించి కుంకుమ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసారు. అనంతరం అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు.

పేదల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే జారే

చంద్రుగొండ జులై 1: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. శుక్రవారం చంద్రుగొండ తహశీల్దార్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందచేశారు. అనంతరం మండల పరిధిలోని సీతాయిగూడెం, చంద్రుగొండ, తిప్పనపల్లి, తుంగారం తదితర గ్రామాల్లో పర్యటించి ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.2 లక్షల వకరు ప్రతి రైతుకు రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం పేదలకు, రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందజేస్తోందని తెలిపారు. వీటిని వారి దరి చేరేలా చూడాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తోందని తెలిపారు.

అన్నపురెడ్డిపల్లిలో..

అన్నపురెడ్డిపల్లి మండలంలోని కవంగూడెం, అబ్బుగూడెం, అన్నపురెడ్డిపల్లి, పెద్దిరెడ్డిగూడెం తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా జరిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణమాఫీ తోపాటు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వ అమలు చేస్తోందన్నారు.


లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

ఆర్టీసీ లాజిస్టిక్స్ సర్వీస్ సెంటర్ ప్రారంభం



గుండాల, జూలై 26: ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ హనుమ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆర్టీసీ లాజిస్టిక్స్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతితక్కువ చార్జీతో అత్యంత వేగంగా కార్గో, పార్సిల్, కొరియర్ సర్వీస్‌లు గమ్య స్థానాలకు చేరవేయబడతాయని తెలిపారు. సర్వీసులు ఆన్‌లైన్ చేశామని, తద్వార వినియోగదారులు బుకింగ్ వివరాలు, చార్జీ వివరాలతో పాటు ఆర్డర్ ట్రాకింగ్ కూడా చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కె.ఉపేందర్, మానాల వెంకటేశ్వర్లు, కొంతం నాగార్జున, మానాల నారాయణ మూర్తి, రాములు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వారాహి అమ్మవారికి పూజలు


పూజల్లో పాల్గొన్న మహిళలు

అశ్వారావుపేట, జూలై 26: అశ్వారావుపేటలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వారాహి అమ్మవారి పూజా కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు ముత్తా సుమాకర్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు సత్యమూర్తి, అచ్యుత్ ఆచార్యుల వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారిని వారాహి అలంకరణ చేసి అభిషేకాలు, అర్చనలు చేసారు. అనంతరం వందలాది మంది మహిళలు వారాహి అమ్మవారికి కుంకమాది పూజలు చేసారు.

అడ్డాల వద్ద వాష్ రూమ్స్ ఏర్పాటు చేయాలి



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా

లక్ష్మీదేవిపల్లి, జూలై 26: బిల్డింగ్ వర్కర్స్ అడ్డాల వద్ద షెడ్లు, వాస్ రూమ్స్ ఏర్పాటుచేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరణించిన కార్మికులకు రావాల్సిన క్లైమ్స్ పెండింగ్‌లో నెలల తరబడి ఉన్నాయని, నూతన కార్డుకు బయోమెట్రిక్ సిస్టమ్ వల్ల ఆన్‌లైన్ సమస్యలు వస్తున్నందున పాత విధానంలో కార్డులు తక్షణం అందించాలని కోరారు.

చిరస్మరణీయుడు చంద్ర రామయ్య

జూలూరుపాడు, జూలై 26: పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన నాయకుడు చంద్ర రామయ్య అని, ఆయన సేవలు చిరస్మరణీయమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు అన్నారు. సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జూలూరుపాడులో సీపీఐ మాజీ మండల కార్యదర్శి, రైతు సంఘం నాయకులు చంద్ర రామయ్య 17వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్ధంతి సందర్భంగా జూలూరుపాడు పంచాయతీ కార్యలయంలో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన సీపీఐ భద్రాద్రి, ఖమ్మం జిల్లాల కార్యదర్శులు షేక్ సాబీర్‌పాషా, పోటు ప్రసాద్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అనేక సమస్యల పరిష్కారానికై రామయ్య బలమైన పోరాటాలు నిర్వహించి సీపీఐకై మంచి గుర్తింపు తెచ్చారని కొనియాడారు. ఆయన జీవితాన్ని కమ్యూనిస్టు పార్టీకి త్యాగం చేశారని అన్నారు. రామయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ భద్రాద్రి, ఖమ్మం జిల్లాల కార్యదర్శులు ఎస్‌కె. సాబీర్‌పాషా, పోటు ప్రసాద్ జిల్లా నాయకులు చంద్ర నరేంద్ర కుమార్, ముత్యాల విశ్వనాథం, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, నాయకులు నాగుల్‌మీరా, వై. మధు, చాంద్‌పాషా, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఏరియా వర్క్‌షాప్ కార్మికుల వినతి

మణుగూరుటౌన్, జూలై 26: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2 నూతన గని సైట్ కార్యాలయంలో కార్మికులకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరుతూ.. ఏరియా వర్క్‌షాప్ కార్మికులు శుక్రవారం ప్రాజెక్ట్ ఆఫీసర్ లక్ష్మీపతిగౌడ్‌కు వినతి పత్రమందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. వర్క్‌షాప్ పక్కనే ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను మార్చాలని, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ షెడ్‌పక్కన ఖాళీగా ఉన్న స్థలంలో పార్క్ చేయించాలని, మ్యాన్‌వేను ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు నిర్మించాలని, క్యాంటీన్‌తోపాటు విశ్రాంతి భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మేకల ఈశ్వర్, అబ్దుల్ రవూఫ్, వెంకటరత్నం, రామమూర్తి, వెంకటేశ్వర్లు, భద్రయ్య, సంజీవ్, విల్సన్‌రాజ్, హేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రమాద బీమా వర్తింపుపై అవగాహన

మణుగూరుటౌన్, జూలై 26 : సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు రూ.30 లక్షల ఉచిత ప్రమాద బీమా సదుపాయాన్ని వర్తింపచేయడంపై ఏరియా జీఎం దుర్గం రామచందర్ ఏరియా సింగరేణి ప్రిన్సిపల్ ఎంప్లాయర్స్ హెచ్‌డీఎఫ్‌సీ ప్రతినిధులతో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత ప్రమాద బీమ పొందడంపై ఉన్న సందేహాలను హెచ్‌డీఎఫ్‌సీ బ్రాంచి మేనేజర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం, ప్రతినిధులు లక్ష్మీనారాయణ నివృత్తి చేశారు. సమావేశంలో ఎస్ఓటు జీఎం శ్యాంసుందర్, ఏజీఎం సివిల్ డీ వెంకటేశ్వర్లు, పీకేఓసీ పీవో లక్ష్మీపతిగౌడ్, మణుగూరు ఓసీ పీఓ శ్రీనివాసచారి, డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్, డీజీఎం ఎస్ఎంఎస్ ప్లాంట్ డీజీఎం నర్సింహస్వామి, డాక్టర్ శేషగిరిరావు, కేపీయుజీ మేనేజర్ భైరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సంక్షేమ అధికారులు మదార్ సాహెబ్, అవినాష్, కాంట్రాక్టర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

కరకగూడెం, జూలై 26: విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని కరకగూడెం మండల జడ్పీటీసీ కొమరం కాంతారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలను జడ్పీటీసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న పరిసరాలను పరిశుభ్రతను పరిశీలించిన ఆయన విద్యార్థులకు వండిన వంటకాలను చూసి విద్యార్థులకు రుచికరమైన వంటలు అందించాలని సిబ్బంది సూచించారు.

వైభవంగా అమ్మవారి రథయాత్ర

కొత్తగూడెం సాంస్కృతికం, జూలై 26: కొత్తగూడెంలోని శ్రీ మహంకాళి అమ్మవాబోనాల జాతరను పురస్కరించుకుని శుక్రవారం మహంకాళి అమ్మవారి రథయాత్ర మహోత్సవాన్ని కాళిఉపాసకులు నరేంద్రభవాని ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పట్టణ నలుమూలల నుంచి భక్తులు బారులు తీరారు. మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ మహంకాళి అమ్మవారి రథయాత్ర మహోత్సవం ఆలయం నుంచి ప్రారంభమై కొత్తగూడెంలోని వీధుల్లో ఊరేగింపుగా సాగింది. భక్తులు అమ్మవారి రథాన్ని లాగుతూ భక్తి పారవశ్యం చెందారు. దారి పొడవున అమ్మవారి రథానికి ఎదురుగా నీటితో శుద్ధిచేస్తూ కొబ్బరికాయలుకొట్టి హారతులు సమర్పించుకున్నారు. ఊరేగింపులో శివసక్తుల కేరింతలు, గిరిజనుల కొమ్ము నృత్యాలు, మహిళల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ రథయాత్ర మహోత్సవంలో కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని), సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, కాళి ఉపాసకులు నరేంద్రభవాని, ఇదుపుగంటి శ్రీనివాసరావు, లక్ష్మణ్, వార్డు కౌన్సిలర్లు బండారి రుక్మాంగధర్, విజయ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.


రథయాత్రలో పాల్గొన్న భక్తులు

రైతులు కొత్త రుణాన్ని తీసుకోవాలి: డీఏవో


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి బాబూరావు

సుజాతనగర్, జూలై 26: ప్రస్తుతం రుణమాఫీ పొందిన రైతులు మళ్లీ కొత్త రుణాలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బాబురావు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సర్వారం గ్రామంలో ఆయన ఇంటింటికి వెళ్లి రుణమాఫీ పొందిన రైతులతో మాట్లాడి, వారి స్పందనను అడిగి తెలుసుకున్నారు. రైతులంతా కూడా రుణమాఫీ పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రుణమాఫీ పొందిన రైతులు కొత్త రుణాలు తీసుకోవాలని కోరారు. రుణమాఫీ అయిన రైతుల విషయంలో కొత్త రుణాలు పొందేందుకు బ్యాంక్ అధికారులు సహకరించాలని, వారికి పెట్టుబడుల నిమిత్తం కొత్త రుణం మంజూరుచేయాలని తెలిపారు. ఆయన వెంట వ్యవసాయాధికారి (టెక్నికల్) సాయి నారాయణ, మండల వ్యవసాయాధికారి జి.నర్మద, వ్యవసాయ విస్తరణాధికారి ప్రనూష, రైతులు ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

జూలూరుపాడు, జూలై 26: ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు జూలూరుపాడు ఎస్ఐ రాణా ప్రతాప్ శుక్రవారం సాయంత్రం తన సిబ్బందితో కలిసి జూలూరుపాడులో వాహనాల తనిఖీ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నెంబరు ప్లేట్లు లేని వాహనాలతోపాటు, సరైన పత్రాలు లేని వాహనాలను పట్టుకుని సీజ్ చేసిపోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ 30 వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. తరుచూ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నామని, ప్రతి ఒక్కరు విధిగా పత్రాలను కలిగి ఉండాలని కోరారు. తప్పనిసరిగా నెంబరు ప్లేట్లు కలిగి ఉండాలని లేనిచో సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అవసరమైన అన్ని కాగితాలను తమ దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

వరద సంరక్షణపై ఎన్డీఆర్ఎఫ్ అవగాహన

దుమ్ముగూడెం, జూలై 26: గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎన్డీఆర్ఎఫ్ కమాండర్ భూపతిరావు అన్నారు. దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వరద సంరక్షణ చర్యలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. గాలి చొరబడని ఖాళీ సీసాలు, వాటర్ క్యానులు, ట్యూబులతో నిర్మించిన లైఫ్ జాకెట్లను ఇళ్లలోనే తయారు చేసుకోవచ్చని, దీంతో ఆకస్మిక వరదల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. వరదలు తగ్గిన వెంటనే ఒక్కసారిగా ఇళ్లలోకి వెళ్లవద్దని పాములు, విష కీటకాలతో ప్రమాదం పొంచి ఉంటుందన్నారు. వరదల సమయంలో అందరూ అప్రమ్తతంగా ఉండాలని సూచించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మణిధర్, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య, రెవెన్యూ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల కార్గిల్ దివాస్

మణుగూరుటౌన్, జూలై 26: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ బాలుర కళాశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు కొవ్వత్తులతో అమరులైన సైనికులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్న సైనికుల త్యాగాలు మరువలేనివని, వారి త్యాగాలను, త్యాగ ఫలితాలను ఎల్లప్పుడు స్మరించుకోవాలని, రాబోయే తరాలకు సైనికుల త్యాగాలను తెలియచేయాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏవో కృష్ణ, ఎన్‌సీసీ సిబ్బంది, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకంలో డ్రాపవుట్ల భర్తీ

చుంచుపల్లి, జూలై26: బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకంలో డ్రాప్ అవుట్‌ల భర్తీ చేయనున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి డి.అనసూర్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న రుద్రంపూర్ సెయింట్ జోసెఫ్ పాఠశాలలో నాన్ రెసిడెన్షియల్ పరిధిలో 5వ తరగతిలో ఒక సీటు, 7వ తరగతిలో ఒక సీటు ఉన్నాయన్నారు. అదేవిధంగా భద్రాచలంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ నాన్ రెసిడెన్షియల్ విభాగంలో 3వ తరగతిలో 4 సీట్లు, 4వ తరగతిలో ఒక సీటు, 6వ తరగతిలో ఒక సీటు ఉన్నాయని తెలిపారు. రెసిడెన్షియల్ విభాగంలో 7వ తరగతిలో 5 సీట్లు, 8వ తరగతిలో నాన్ రెసిడెన్షియల్‌లో 1 సీటు, రెసిడెన్షియల్‌లో 7 సీట్లు ఉన్నాయి. 9వ తరగతిలో నాన్ రెసిడెన్షియల్‌లో 3 సీట్లు, రెసిడెన్షియల్‌లో 3 సీట్లు ఉన్నాయి. మొత్తం లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో 25 సీట్లు, రుద్రంపూర్ సెయింట్ జోసెఫ్‌లో 2 సీట్లు మొత్తం 27 సీట్లును భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

బొగ్గు బ్లాక్‌లను సింగరేణి యాజమాన్యానికి అప్పచెప్పాలి

కొత్తగూడెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బొగ్గుబ్లాక్‌లను సింగరేణి యాజమాన్యానికి అప్పచెప్పాలని సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ డిమాండ్ చేశారు. బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి సంస్థకే పూర్తి అధికారం ఇవ్వాలని కోరారు. శుక్రవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు త్యాగరాజన్, అల్బర్ట్, ఎండి. రజాక్, పీతాంబరం, కాల్వ నాగభూషణం, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

కరకగూడెం, జూలై 26: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రేగా కాళిక అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశానికి మండల స్థాయి అధికారులు కొందరు డుమ్మ కొట్టారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావల్సిన సమావేశం 11:30 సమయం దాటిన తర్వాత అధికారులు మొదలుపెట్టారు. ఆగస్టు 6వ తేదీతో ఎంపీటీసీలు, జడ్పీటీసీ పదవి కాలం ముగిస్తుండటంతో ఎంపీపీ రేగా కాళిక, వైస్ ఎంపీపీ ఎలిపెద్ది శైలజ, జడ్పీటీసీ కొమరం కాంతారావును అధికారులు ఘనంగా సన్మానించారు.

పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

మణుగూరుటౌన్, జూలై 26: తెలంగాణాలోని గ్రామ పంచాతీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిధులను విడుదల చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన వివిధ పంచాయతీలను సందర్శించి అక్కడ నెలకొన్న పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల్లో నిధులు లేకపోవడం వలన ట్రాక్టర్ల కిస్తీలు కట్టలేని పరిస్థితి నెలకొందని, ఉన్న ట్రాక్టర్‌లలో డీజీల్ పోయించే పరిస్థితి లేదన్నారు. పంచాయతీ వర్కర్లకు జీతాలు చెల్లించే పరిస్థితి కూడా లేదన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం: ఏఐఎస్ఎఫ్

పాల్వంచ టౌన్, జూలై 26: బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించి విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్ శుక్రవారం ఆరోపించారు. చంద్ర రాజేశ్వరరావు (సీఆర్) భవన్‌లో జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7. 3శాతం నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో తెలిసిందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి పేద విద్యార్థుల భవిష్యత్‌కు, విద్యారంగ అభివృద్ధికి భరోసా కల్పించాలని కోరారు. ఇందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.